PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 267 | విజయవాడ, గురువారం 2 మే 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 2 May 2024 | Rs

బిజెపిని హడలెత్తిస్తున్న హర్యానా

- జెజెపి, బిజెపి పొత్తు విచ్ఛిన్నం
- సిఎం ఖట్టర్ మార్పు
- రైతు, రెజ్లర్ల ఆందోళనల ప్రభావం
- గత ఎన్నికలకు భిన్నంగా ఇండియా బ్లాక్‌లో భాగంగా కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ

4

పంజాబ్ భల్లే.. భల్లే..

- బౌలింగ్‌లో మెరిసిన హర్‌ప్రీత్, చాహర్
- చెన్నైపై ఏడు వికెట్ల తేడాతో పంజాబ్ ఘన విజయం
- గైక్వాడ్ అర్ధసెంచరీ



8

భోజన ఖర్చు బారెడు!

- వేతనాలేమో మూరెడు • ఐదేళ్లలో మీల్స్ రేటు 71శాతం పెరిగింది
- వేతన పెరుగుదల 37శాతం మాత్రమే

న్యూఢిల్లీ : దేశంలో ధరల దరువుకు సగటు వేతన జీవి విలవిలలాడుతున్నాడు. కుటుంబ ఆదాయంలో అధిక భాగం తిండికే ఖర్చు అవుతోంది. ఆకాశాన్నంటుతున్న ఆహార ధరలకు, వేతనాలకు మధ్య అంతరం పెరిగిపోతోంది. తాజాగా వెలువడిన ఓ సర్వే ప్రకారం భోజన ఖర్చు శరవేగంగా పెరుగుతుంటే, వేతనాల్లో పెరుగుదల చాలా నెమ్మదిగా ఉంటోంది. ఈ సర్వే మహారాష్ట్రలో నిర్వహించినప్పటికీ, మిగతా దేశమంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ఇంట్లో వండుకునే శాకాహార భోజనం సగటు వ్యయం గత ఐదేళ్ళలో 71శాతం పెరిగింది. అదే సమయంలో, రెగ్యులర్ ఉపాధి ద్వారా ఒక వ్యక్తి సంపాదించే నెలవారీ వేతనంలో పెరుగుదల కేవలం 37శాతం మాత్రమే. ఇదే కాలంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా క్యాజువల్ కార్మికుల వేతనాలు 67శాతం పెరిగాయి. అయితే, ఆహారంపై తమ నెలవారీ వేతనాల్లో అధిక వాటాను కార్మికులు ఇప్పటికే ఖర్చు చేస్తున్నారన్న అంశం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం కీలకం.

దీనిపై విశ్లేషణ చేయడం కోసం మనం ఇక్కడ సగటు భారతీయ కుటుంబం బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లు మూడింటి కింద రోజుకు రెండు భోజనాలు తిన్నట్లైతే వారి రోజువారీ ఆహార అవసరాలు తీరగలవని భావిద్దాం. గతంలోని డేటా సరిగా లేనందున మాంసాహార భోజనాలను ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం లేదు. అలాగే సరుకుల ధరలకు సంబంధించి స్థిరమైన డేటా అందుబాటులో వున్న కారణంగా మహారాష్ట్రను ఒక ఉదాహరణగా తీసుకున్నారు. పోల్చి చూసేందుకు మహారాష్ట్రలో కార్మికుల సగటు వేతనాలను, ఉద్యోగుల జీతాలను పరిగణనలోకి తీసుకున్నారు.

ఆహారం మరింత భారం

వినియోగదారుల వ్యవహారాల విభాగం, జాతీయ ఉద్యానవన బోర్డు, క్రమం తప్పకుండా చేసే కార్మిక సర్వే, మహారాష్ట్రకు జిల్లా స్థాయి అంచనాలపై నివేదిక వీటన్నింటినుండి తీసుకున్న డేటా ఆధారంగా ఈ పట్టికలను రూపొందించారు.



టేబుల్ 1 : రెండు భోజనాలకు అవసరమైన పదార్థాల బరువు, వాటి రిటైల్ ధరలు రూపాయిల్లో

సరుకులు	ఎ : రెండు భోజనాలకు అవసరమయ్యే గ్రాములు	బి : 2024మార్చిలో కిలో ధర	సి : ఏడాది క్రితం ధర	డి : ఐదేళ్ల క్రితం ధర	కొనుగోలు ధర (మార్చి) (బి*ఎ/1000)	కొనుగోలు ధర (ఏడాది క్రితం) (సి*ఎ/1000)	కొనుగోలు ధర (ఐదేళ్ల క్రితం) (డి*ఎ/1000)
రైస్	125	51.12	43.12	35.83	6.4	5.4	4.5
గోదుమపిండి	250	42.74	41.1	30.03	10.7	10.3	7.5
ఆయిల్	36.3	119.92	150.39	90.71	4.4	5.5	3.3
టమాట	100	28.28	20.78	25.56	2.8	2.1	2.6
ఉల్లిపాయలు	100	26.01	22.04	14.3	2.6	2.2	1.4
ఉప్పు	12.8	23.43	23.39	16	0.3	0.3	0.2
బంగాళదుంప	300	28.65	25.07	22.55	8.6	7.5	6.8
పప్పు	125	160.99	119.94	74.23	20.1	15.0	9.3
వెల్లుల్లి	25	238.7	100.87	43.04	6.0	2.5	1.1
పచ్చిమిర్చి	25	102.61	57.83	68.7	2.6	1.4	1.7
అల్లం	7.5	163.04	80	86.09	1.2	0.6	0.6
బఠానీలు	60	76.52	46.96	37.83	4.6	2.8	2.3
క్యాబేజీ	250	36.09	34.35	20	9.0	8.6	5.0

రెండు భోజనాలకు సగటున ఎంత ఖర్చు అవుతుందో నిర్ణయించడానికి ముందుగా, ఆ భోజనానికి వాడిన పదార్థాలను చూసినట్లైతే, బియ్యం, కందిపప్పు, ఉల్లి, వెల్లుల్లి, పచ్చిమిరప, ఆల్లం, టమోటా, బంగాళాదుంప, బఠాణీలు, గోధుమపిండి, కేబేజీ, సన్‌ఫ్లవర్ నూనె, ఉప్పు ఇవన్నీ రెండు సార్లు తినడానికి ఎంత మొత్తం కావాలో ఆ గ్రాములను కూడా లెక్కలోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో ఆ వస్తువులన్నీ కొనేందుకు సగటు రిటైల్ ఖర్చు ఈ ఏడాది మార్చి నాటికి ఎంత అవుతోంది, ఏడాది క్రితం అంటే 2023లో ఎంత అయింది, ఐదేళ్ల క్రితం 2019లో ఎంత అయిందో చూసేందుకు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ ఉద్యానవన బోర్డుల నుండి సేకరించిన సమాచారాన్ని ఆధారంగా తీసుకున్నారు. కొన్ని కూరగాయలకు డేటా అందుబాటులో లేదు. ముంబయిలో ధరలను పరిగణనలోకి తీసుకున్నారు.

ఉదాహరణకు, రెండు భోజనాలకు సరిపడా 125 గ్రాముల కందిపప్పుతీసుకుంటే అయ్యే ఖర్చు గత ఐదేళ్ళలో రూ.9.30 నుండి రూ.20.1కి పెరిగింది (పట్టిక- 1). అలాగే 300గ్రాముల బంగాళాదుంపలు తీసుకోవడానికయ్యే ఖర్చు రూ.6.8 నుండి రూ.8.6కి పెరిగింది.

మహారాష్ట్రలో రెండు తాలీలకు అవసరమైన పదార్థాల సగటు ఖర్చు ఈ ఏడాది రూ.79.2గా వుండగా, గతేడాది రూ.64.2గా వుంది. 2019లో అయితే ఈ మొత్తం రూ.46.2గా వుంది (పట్టిక- 2). అంటే మహారాష్ట్రలో ఒక కుటుంబంలో రెండు భోజనాలు వండేందుకు అయ్యే ఖర్చు నెలకు 2019లో రూ.1386గా వుండగా, 2024కు వచ్చేసరికి రూ.2377కి పెరిగింది.

ఒక వ్యక్తి రోజువారీ సగటు జీతం 2019లో రోజుకు రూ.218గా వుండగా, 2024లో అది రూ.365గా వుంది. 30రోజులకు లెక్కిస్తే నెలవారీ ఆదాయాలు వస్తాయి.

నెలలో ప్రతిరోజూ రెండు భోజనాలకయ్యే వ్యయాన్ని, వేతనాలు లేదా జీతాల్లో ఒక వాటాగా పరిగణించినపుడు, క్యాజువల్ కార్మికుని నెలవారీ ఆదాయాల్లో 2019లో 21.1శాతంగా వున్న ఈ వాటా 2024లో 21.7శాతానికి పెరిగింది. విశ్రాంతి దినాలతో సహా అన్ని రోజులకూ మిగతా7లో



భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరులో 'పోలవరం' నిర్వాసితుల అవస్థలు (ఫైల్)

పునరావాసం నిర్వాసితుల హక్కు

- సెస్ విధిస్తామన్న పవన్‌కల్యాణ్ ప్రతిపాదన గర్హనీయం
- టిడిపి, వైసిపి, తమ వైఖరి వెల్లడించాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విభజన చట్టం ప్రకారం, పోలవరం జాతీయ ప్రాజెక్టు కనుక అన్ని విధాలా దాని నిర్మాణ బాధ్యత సంపూర్ణంగా కేంద్ర ప్రభుత్వానిదే అయినప్పటికీ నిర్వాసితుల పునరావాసం, పరిహారం నిమిత్తం రాష్ట్ర ప్రజలపై సెస్సు విధిస్తామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రతిపాదించడం గర్హనీయమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కులను, నిధులు సాధించుకోవాల్సింది పోయి వారికి సాష్టాంగపడటం దారుణమని పేర్కొన్నారు. గత పదేళ్లుగా అటు టిడిపి, ఇటు వైసిపి రెండు ప్రభుత్వాలు డ్యామ్ నిర్మాణం గురించి తప్ప నిర్వాసితులను పూర్తిగా గాలికొదిలేశారని డ్యాం నిర్మాణం సైతం ప్రమాదంలో పడిందని తెలిపారు. డబ్బుంతా కాంట్రాక్టర్లకు కట్టబెట్టారని, వరదలొస్తే గ్రామాలకు గ్రామాలు గోదాట్లో నెలల తరబడి మునిగిపోయిన దుస్థితి నెలకొందని, ఇటువంటి సమయంలో తొలుత నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రజలందరి డిమాండుగా ఉందని తెలిపారు. తమ సర్వస్వాన్ని పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని బిచ్చమెత్తి(క్లౌడ్‌ఫండింగ్) సేకరిస్తామని పవన్‌కల్యాణ్ చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ చట్టం(2013) ప్రకారం అన్ని సౌకర్యాలతో పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం, ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్రంలో అన్ని పార్టీలూ కృషి చేయడం కనీస బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల నుండి సెస్సు వసూలు చేస్తాం, బిచ్చమెత్తి పరిహారం చెల్లిస్తాం అన్న జనసేన అధినేత ప్రతిపాదనను ప్రజలు నిర్ద్వందంగా తిరస్కరించాలని కోరారు. ఈ విషయంపై టిడిపి, జనసేన తమ వైఖరులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల పక్షాన మరింత పట్టుదలగా సిపిఎం కృషి కొనసాగిస్తుందని శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు.

హిందూ రాజ్యం...రిజర్వేషన్ల రద్దు

- ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతం ఇదే
- ఆధారాలతో చెబుతున్నా... బిజెపి ఆదే చేస్తోంది
- విలేకరుల సమావేశంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'హిందూ రాజ్య నిర్మాణంతో పాటు రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతం. బిజెపి దానికోసమే పని చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు అడగటం కూడా అందుకోసమే.' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో పార్టీ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, నాయకులు మధుయాష్కీగౌడ్, బెల్లయ్యనాయక్, అద్దంకి దయాకర్‌తో కలిసి ఆ విలేకర్లతో బుధవారం సాయంత్రం మాట్లాడిన ఆయన తాను ఈ విషయాలను పూర్తి ఆధారాలతో చెబుతున్నానని అన్నారు. 'రిజర్వేషన్లను రద్దు చేయాలనే అంశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్ రాయలేదా? ఆర్‌ఎస్‌ఎస్ ఫిలాసపర్ ఎమ్జీ వైద్య వ్యాసాలు రాయలేదా? అని ప్రశ్నించారు.. మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్, మోడీ మంత్రివర్గంలోని సహచర మంత్రులు రిజర్వేషన్ల రద్దుపై బహిరంగంగానే మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగ సమీక్ష కోసం నాటి ప్రధాన మంత్రి వాజ్‌పేయి జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ చైర్మన్‌గా పది సభ్యులతో కమిటీని నియమించలేదా? ఆని ప్రశ్నించారు. దీనిపై గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదా? అని నిలదీశారు. ఆ కమిటీ నివేదికను ఇంతవరకు బయటపెట్టలేదని చెప్పారు. అప్పటి రాష్ట్రపతి కెఆర్ నారాయణ్ పార్లమెంటులో చేసిన ప్రసంగలో కూడా రిజర్వేషన్ల రద్దు గురించి ఉందన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి వేసుకున్న ప్రణాళికలనే తాను ప్రస్తావించానన్నారు. ఈ నిజాలను చెబుతున్నందుకే ఢిల్లీ పోలీసులను తనపై ప్రయోగిస్తున్నారని, తద్వారా తెలంగాణ సమాజాన్ని భయపెట్టాలని మిగతా2లో

కార్మికులు సంపద సృష్టిస్తే...
అదాని, అంబానీలకు పంచి పెడతారా?

- ప్రజాగరళంగా టిడిపి, జనసేన, బిజెపి మేనిఫెస్టో
- నెల్లూరు రోడ్ షో వి శ్రీనివాసరావు



ఆత్మకూరు బస్టాండ్‌లో రోడ్ షోలో రోడ్ షోలో వి.శ్రీనివాసరావు, కార్మికులు (ఇన్‌సెట్‌లో) రోడ్ షోలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు సంపద సృష్టించి పంచుతానని చెబుతున్నారని, దీనిని ప్రజలకు పంపిణీ చేస్తారా? అదాని, అంబానీలకు పంచుతారా స్పష్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రజాగళం పేరుతో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజాగరళంగా ఉందని విమర్శించారు. ఇండియా వేదిక కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కె.రాజు, సిపిఎం అభ్యర్థి మూలం రమేష్‌ల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం నెల్లూరులో శ్రీనివాసరావు రోడ్ షో నిర్వహించారు. శెట్టిగుంట రోడ్డు నుంచి ప్రారంభమైన రోడ్ షో పప్పుల వీధి, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, సుందరయ్య విగ్రహం, గాంధీబొమ్మ, విఆర్‌సి, చిన్నబజార్ మీదుగా ములుముడి బస్టాండ్ వరకు సాగింది. రోడ్డు పొడవునా ప్రజలు స్వాగతం పలికారు. అంతకు ముందు శ్రీనివాసరావు మాట్లాడుతూ మేడేని ప్రపంచవ్యాపితంగా కార్మికులు ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. ప్రజలు, కార్మికులు కష్టపడి సంపద సృష్టిస్తున్నారని వివరించారు. దీనిని ప్రభుత్వం అదాని, అంబానీలకు కట్టబెట్టేలా నిర్ణయాలు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని కబ్జా చేయడానికి వస్తోన్న బిజెపికి వైసిపి, టిడిపి తోడ్పాటు అందిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపితో కలిసి ఎలా అభివృద్ధి చేస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. ప్రత్యేక హోదా విషయంలో మోసగించిందని, విభజన హామీలు అమలు చేయలేదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిందని, నెల్లూరు జెన్‌కో థర్మల్ ప్రాజెక్టును ప్రయివేటీకరించేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నం మిగతా 2లో

జీతాలు పడ్డాయి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎంతో కాలానికి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే వేతనాలు పడ్డాయి. కొన్నేళ్లుగా ఒకటో తేదీన వేతనాలు, పింఛన్లు జమ కావడం అరుదుగా జరుగుతోంది. ఈ నెల మాత్రం ఒకేసారి అందరికీ చెల్లింపులు జరిగిపోయాయి. బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బ్యాంకులకు సెలవు రోజు అయినప్పటికీ జీతాలు, పింఛన్లను నేరుగా రిజర్వ్‌బ్యాంకు నుంచే చెల్లించారు. రాష్ట్ర సిఎఫ్‌ఎంఎస్ నేరుగా రిజర్వు బ్యాంకుకు అనుసంధానంగా ఉండడంతో చెల్లింపులు సజావుగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఆదివారం ఉదయమే ఈ చెల్లింపుల ప్రక్రియ పూర్తికావడం విశేషం. కొన్నేళ్లుగా జీతాలు, పింఛన్లపై జాప్యం జరుగుతుండడం, ఒక్కో నెల్లో పదో తేదీ నుంచి 15వ తేదీ వరకు చెల్లింపులు జరుగుతుండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. ఇది ఎన్నికల సమయంలో అధికారపార్టీకి ఇబ్బందికరంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఒకటో తేదినే వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆర్థికశాఖకు కూడా పైనుంచి ఆదేశాలు వెళ్లడంతో హడావుడిగా జీతాలు,పింఛన్లు చెల్లింపులు జరిగిపోయాయి.

సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పుల కేసు
కస్టడీలో ఉన్న నిందితుడి ఆత్మహత్య

ముంబయి : బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన కేసులో ఒక నిందితుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముంబయి పోలీస్ క్రైం బ్రాంచి కస్టడీలో ఉన్న నిందితుడు అనుజ్ తపన్ (23) బుధవారం ఉదయం బాత్‌రూమ్‌లో బెడ్‌షీట్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వెంటనే జిటి ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ మరణించాడని అధికారులు తెలిపారు. అనుజ్ తపన్ ఆత్మహత్య చేసుకున్నాడని డిప్యూటీ పోలీస్ కమిషనర్ దత్తా నలవాడే తెలిపారు. సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పులు జరిపిన కేసులో ఏప్రిల్ 25న పంజాబ్‌లో సోను సుభాష్ చందర్ (37)తోపాటు అనుజ్ తపన్‌ను అరెస్టు చేసి, ముంబయి తీసుకొచ్చి, పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలోని క్రైమ్ బ్రాంచ్ లాకప్‌లో కస్టడీలో ఉంచారు. సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద ఐదు రౌండ్లు కాల్పులు జరిపిన నిందితులకు తపన్ ఆయుధాలను సరఫరా చేశాడని పోలీసులు ఆరోపిస్తున్నారు.

మారణ హోమం ఆపండి

మేడే రోజున గ్రీస్‌లో కార్మికుల గర్జన



గాజాలో ఊచకోత ఆపాలని, యూరపు దేశాల సగటు వేతనాలతో సమంగా తమ వేతనాలు పెంచాలని కోరుతూ బుధవారం నాడు ఏథెన్స్ వీధుల్లో కదంతొక్కిన కార్మికలోకం

• లోపలి పేజీలో..

'అక్కడ' గాజు గ్లాసు జనసేనకే!

ఇతరులకు కేటాయించం • హైకోర్టుకు ఇసి నివేదన

ప్రజాశక్తి-అమరావతి

గాజు గ్లాసు గుర్తు కేటాయింపు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంతో జనసేన ఎన్నికల చిహ్న కేటాయింపు వివాదం దాదాపుగా కొలిక్కివచ్చింది. జనసేన పార్టీ పోటీ చేసే 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, వాటి పరిధిలోని లోక్‌సభ సీట్లకు పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు కేటాయించ కూడదని నిర్ణయించినట్లు ఇసి హైకోర్టుకు తెలిపింది. అదే విధంగా జనసేన పోటీ చేస్తున్న రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని అన్ని అసెంబ్లీ సీట్లలోనూ పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు, ఇతరులకు కూడా గాజుగ్లాస్ గుర్తు కేటాయించేది లేదని ఇసి వివరించింది. ఒకవేళ ఇప్పటికే ఈ తరహా కేటాయింపులు జరిగి ఉంటే రిటర్నింగ్ అధికారులు సమీక్షించి తగిన నిర్ణయం తీసుకుంటారని తెలిపింది.

గాజు గ్లాసు గుర్తుపై జనసేన ఇచ్చిన వినతిపత్రంపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ధర్మాసనానికి రాతపూర్వకంగా వివరించింది. దీంతో గాజు గ్లాసు గుర్తు కేటాయింపుపై జనసేన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణను ముగిస్తున్నటు హైకోర్టు ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ బి. కష్ణమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాము పోటీ చేయని అసెంబ్లీ, పార్లమెంట్



నియోజవర్గాల్లో గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించకుండా, ఆ గుర్తును తమ పార్టీకే రిజర్వ్ చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివశంకరరావు పిటిషన్ దాఖలు చేశారు. ఇసి తరపు లాయర్ అవినాశ్ దేశాయ్ అందించిన వివరాలతో జనసేన తరపు సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ సంతప్తిని వ్యక్తం చేశారు. దీంతో న్యాయమూర్తి జనసేన వ్యాజ్యాన్ని మూసివేశారు.

అన్ని నియోజకవర్గాల్లోనూ.... : టిడిపి పిటిషన్

టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నందునగాజు గ్లాసు గుర్తును రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇతరులకు కేటాయించకుండా ఇసిని ఆదేశించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. టిడిపి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బొప్పూడి కష్ణమోహన్ గురువారం విచారణ చేయనున్నారు.

కెఎస్‌బి లిమిటెడ్‌కు రూ.43 కోట్ల లాభాలు

హైదరాబాద్‌ : పంపుల తయారీ కంపెనీ కెఎస్‌బి లిమిటెడ్‌ 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 7.75 శాతం వృద్ధితో రూ.43.1 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.40 కోట్ల లాభాలు నమోదు చేసింది. కెఎస్‌బి జనవరి నుంచి డిసెంబర్‌ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా భావిస్తుంది. గడిచిన మార్చి త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ రూ.489.6 కోట్ల నుంచి రూ.544.2 కోట్లకు పెరిగింది.

చేపల వేట నిషేధం భృతిని రూ.20 వేలకు పెంచాలి

- ఎపి మత్స్యకార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేపల వేట నిషేధం కాలంలో భృతిని ప్రభుత్వం రూ.20 వేలకు పెంచాలని ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. బుధవారం మేడే సందర్భంగా విజయవాడలోని మహంతీ మార్కెట్‌ వద్ద ఆయన మత్స్యకార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకార్మికుల జీవనోపాధి దెబ్బతినేలా వ్యహరిస్తున్నాయని తెలిపారు. సబ్సిడీలను తగ్గించడం సరైంది కాదన్నారు. అలాగే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బ్లూ ఎకానమి పేరుతో సముద్రాన్ని ముక్కలు, ముక్కలుగా విభజించి అమ్మకానికి పెట్టారని అన్నారు. మత్స్యకార్మికులు సంఘటితం కావాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్‌ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్‌ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్‌ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విజయానంద్‌ పిఎస్‌ పేరుతో మోసం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కో సిఎమ్‌డి కె విజయానంద్‌ పిఎస్‌గా పనిచేస్తున్నానంటూ సతీష్‌ అలియాస్‌ సుబ్బారావు అనే వ్యక్తి ప్రజలను నమ్మిస్తున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని ట్రాన్స్‌కో విజిలెన్స్‌ జెఎమ్‌డి బి మల్లారెడ్డి తెలిపారు. విజయానంద్‌ తనకు తెలుసునని, పనులేమైనా ఉంటే చేసిపెడతామని చెబితే నమ్మి మోసపోవద్దని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంశంపై సైబర్‌క్రైమ్‌ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.

తగ్గిన వాణిజ్య గ్యాస్‌ సిలిండర్‌ ధరలు

ఢిల్లీ: వాణిజ్య గ్యాస్‌ సిలిండర్‌ ధరలు తగ్గాయి. చమురు మార్కెటింగ్‌ కంపెనీలు 19 కేజీల కమర్షియల్‌ ఎల్‌పిజి గ్యాస్‌ సిలిండర్ల ధర రూ.19 తగ్గింది. దీంతో ఢిల్లీ రిటైల్‌ విక్రయాల్లో 19కిలోల కమర్షియల్‌ ఎల్‌పిజి సిలిండర్‌ ధర నేటి నుండి రూ.1,745.50గా విక్రయించనున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశాయి. ఈ రోజు నుంచే ఈ తగ్గిన ధరలు అమలులోకి రానున్నాయి. గృహ అవసరాల నిమిత్తం వాడే సిలిండర్‌ ధరలు మాత్రం తగ్గలేదు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌, ఉద్యోగ, కార్మికులకు

కనీస వేతనం, పనిభద్రత కల్పించాలి

మేడే పతాకావిష్కరణలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్‌

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో లక్షల సంఖ్యలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు, కార్మికలకు కనీస వేతనాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. మేడే సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని అన్నారు. ఆర్థిక అసమానతలు, ప్రాంతీయ అసమానతలు పెరిగాయని, రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే స్కీమ్‌ వర్కర్లు, సచివాలయాలు, మెడికల్‌, విద్యుతోపాటు మున్సిపల్‌ ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారికి చట్టం ప్రకారం భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ప్రభుత్వాలు, పాలకులు కార్పొరేట్ల సేవలో తరిస్తున్నాయని, ఎర్రజెండా ఒక్కటే వారి తరపున పోరాడుతోందని అన్నారు. ఈ ప్రభుత్వాలు కూడా కార్పొరేట్లు కావాలో.. ప్రజలు కావాలో.. తేల్చుకోవాలని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేడేను కార్మికుల రోజుగా గుర్తించడానికి ఇష్టపడటం లేదని, విశ్వకర్మ జయంతి పేరుతో కార్మిక వర్గాన్ని అవమానిస్తోందని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టే కబుర్లు చెబుతున్న బిజెపి ఎంపిల్లో నేరస్తులు, రేపిస్టులు ఉన్నారని, కర్ణాటకలో రేవణ్ణ ఘటనే దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో బిజెపిని సాగనంపాల్సిన అవసరం ఉందని వివరించారు. మాజీ ఎంపి పి మధు మాట్లాడుతూ.. దేశంలో కార్మికుల పైనా, కష్టజీవులపైనా, రైతాంగంపైనా దోపిడీ అంతం కావాలని అన్నారు. కార్పొరేట్ల అడుగులకు మడుగులు వత్తే పాలకులు పోవాలని హెచ్చరించారు. వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి రెండు పార్టీలూ కార్మికవర్గానికి నష్టం కలిగించే లేబర్‌ కోడ్‌లకు పార్లమెంటులో ఆమోదం తెలిపాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం, హరికిషోర్‌, సీనియర్‌ నాయకులు వై కేశవరావు పాల్గొన్నారు. అంతకముందు ప్రజానాట్య మండలి కళాకారులు మేడే గీతాలు ఆలపించారు.



విజయవాడ ఎంబివికె వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, తదితరులు

ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- మేడే వేడుకల్లో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్‌.నర్సింగరావు



ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

నేడు దేశంలోని ప్రభుత్వ రంగాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్‌.నర్సింగరావు అన్నారు. మేడే సందర్భంగా గాజువాకలోని 60 అడుగుల రోడ్డులో బుధవారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్‌ బిఆర్‌.అంబేద్కర్‌ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రయత్నం మోడీ హయాంలో జరుగుతోందని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరా గాంధీ ఇలానే వ్యవహరించగా మూడు నెలల్లోనే ఆ ప్రభుత్వం కూలిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. 2014 ఎన్నికల సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోడీ మాటతప్పారన్నారు. యువతను తీవ్రంగా మోసం చేశారని విమర్శించారు. ఒక్క రైల్వేలోనే 3,23,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆర్మీలో కొత్త ఉద్యోగాలు లేకుండా చేశారని, కార్మిక చట్టాలను ఎత్తేసి నాలుగు లేబర్స్‌ కోడ్‌లను తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన మోడీ సర్కారుకు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలపడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రుణాల మాఫీ చేస్తోందని, ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ ప్రయివేటీకరణకు ప్రయత్నిస్తున్న వారికి, వారికి మద్దతు తెలుపుతున్న పార్టీలకు కార్మికవర్గం బుద్ధిచెప్పనుందన్నారు. పోరాటాలతోనే కార్మిక హక్కులను సాధించుకోగలమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్‌ పి.మణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌ తదితరులు పాల్గొన్నారు. తొలుత శ్రీకన్య థియేటర్‌ జంక్షన్‌ నుంచి పాత గాజువాక జంక్షన్‌ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

లబ్ధిదారులనే నమ్ముకున్నా...

- చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు
- ల్యాండ్‌ టైటిల్‌ యాక్ట్‌పై లేనిపోని ప్రచారాలు
- ఏలూరు, పాయకరావుపేట, బొబ్బిలి సభల్లో జగన్‌



పాయకరావుపేట సభలో మాట్లాడుతున్న జగన్‌, పక్కన కంబాల జోగులు, బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- యంత్రాంగం

'14 ఏళ్లలో ఒక రోజయినా అవ్వా, తాతల కష్టాలు చంద్రబాబు చూశారా ?.. ఇంటికి పింఛను ఇవ్వకుండా నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషన్‌కు లెటర్‌ రాయించి, నేను పింఛన్లు ఆపినట్లు ఆయన అబద్ధాలు చెబుతున్నారు. భూములు రీ సర్వే చేయించి రికార్డులు తాజా పరిచి, భూములపై సర్వహక్కులనూ మేం హక్కుదారులకు కల్పించే పనిచేస్తే.. ల్యాండ్‌ టైటిల్‌ యాక్ట్‌పై చంద్రబాబు లేనిపోని ప్రచారాలు చేస్తున్నారు' అని వైసిపి అధినేత వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న మహిళలు, యువకులు, వృద్ధులే తనకు శ్రీరామరక్షగా ఉంటారని తెలిపారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొదని కోరారు. ఏలూరు ఫైర్‌స్టేషన్‌ సెంటర్‌, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట సూర్యమహల్‌ జంక్షన్‌, విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. ఈ ఎన్నికలు జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్నవి కావని, రాబోయే ఐదేళ్ల ఇంటింటి అభివృద్ధి, పేదల భవిష్యత్తును నిర్ణయించేవి అన్నారు. పేదల పక్షాన తాము మాట్లాడుతుంటే చంద్రబాబుకు, దత్తపుత్రుడుకు, చంద్రబాబు వదినమ్మకు బాధగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తెల్లరేషన్‌ కార్డుదారులు కోటీ 44 లక్షల మంది ఉన్నారని, ఏలూరు జిల్లా జనాభాలో 90 శాతం తెల్లకార్డుదారులేనని, వీరంతా పేదలు కాదా? అని ప్రశ్నించారు. వెన్నుపోట్లు పొడవడం, కుట్రలు చేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. వార్షిక ఆదాయం రూ.ఐదు లక్షలు పైన ఉన్నవారికి ఆరోగ్యశ్రీ కార్డు ఉందని, ఇలాంటి వారు రాష్ట్రంలో 95 శాతం మంది ఉన్నారన్నారు. మొత్తం రూ.2.70 లక్షల కోట్లు డిబిటి ద్వారా బటన్‌ నొక్కి నేరుగా ఖాతాల్లోకి జమ చేశామన్నారు.

175 అసెంబ్లీ, 25 లోక్‌సభ మొత్తం 200 స్థానాల్లో వందస్థానాలు ఎస్‌సి, బిసి, మైనార్టీలకు ఇచ్చామని తెలిపారు. 2014లో టిడిపి మేనిఫెస్టోలో పెట్టిన రుణమాఫీ, డ్వాకా రుణమాఫీ, ఆడబిడ్డలకు రూ.25 వేలు జమ, నిరుద్యోగ భృతి, బిసి సబ్‌ప్లాన్‌, సింగపూర్‌ మోడల్‌ అభివృద్ధి వంటివి ఏ ఒక్కటైనా అమలయ్యాయా? అని చదివి వినిపించారు. మోసాలు, అబద్ధాల మధ్య జరుగుతున్న ఎన్నికల్లో తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని, ఎంపి అభ్యర్థి సునీల్‌కుమార్‌ యాదవ్‌, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై కుట్రలు చేస్తున్న వారికి బుద్ధిచెబుతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించేందుకు కుట్రలు పన్నుతున్నవారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతన్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1175వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ ఎల్‌ఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. తొలుత మేడే వేడుకలను దీక్షా శిబిరంలో నిర్వహించారు. పోరాట కమిటీ నాయకులు డిసిహెచ్‌ వెంకటేశ్వరరావు, డి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కుపై మోడీ సర్కారును నిలదీయడంలో వైసిపి, టిడిపిలు విఫలమయ్యాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఏం చేశారని సిఎం జగన్‌ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును నష్టాల వైపునకు కేంద్రం నెట్టేస్తుంటే ఆయన నోరు మెదపలేదని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న బిజెపికి రాష్ట్రంలోని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ మద్దతు తెలపడం దారుణమన్నారు. మోడీ సర్కారుతో అవకాశవాద దృక్పథంతో వ్యవహరించిన పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ ఉత్పత్తికి అదానీ గంగవరం పోర్టు తన చర్యలతో ఎలా నష్టం చేకూర్చుతున్నదీ వివరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి సురేష్‌, డి శ్రీనివాస్‌, గుమ్మడి నరేంద్ర, జగ్గారావు, నూకరాజు, శివ పాల్గొన్నారు.

7 నుంచి ఇఎపిసెట్‌ హాల్‌ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పలు ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన హాల్‌ టికెట్ల డౌన్‌లోడ్‌ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈ మేరకు మండలి కార్యదర్శి నజీర్‌ అహ్మద్‌ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్‌, అగ్రికల్చర్‌, ఫార్మసీ ప్రవేశాలకు సంబంధించిన ఇఎపిసెట్‌-2024 హాల్‌ టికెట్లను ఈ నెల 7 నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో బైపిసి అభ్యర్థులకు, 18 నుంచి 23 వరకు ఎంపిసి విద్యార్థులకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్‌ హాల్‌ టికెట్లను గురువారం నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. ఈ నెల 6న ఈ పరీక్ష జరగనుంది. ఇంజినీరింగ్‌ కోర్సు రెండో ఏడాది ప్రవేశాలకు సంబంధించిన ఇసెట్‌ హాల్‌ టికెట్లు బుధవారం నుంచి అందుబాటులో ఉంటాయి. ఈ నెల 8న ఉన్నత విద్యామండలి ఈ పరీక్ష నిర్వహించనుంది. పిజి కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన పిజిఇసెట్‌ హాల్‌ టికెట్లు ఈ నెల 22 నుంచి అందుబాటులో ఉంటాయి. ఈ పరీక్ష ఈ నెల 29 నుంచి 31 వరకు జరగనుంది. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌ ఎ‌వ్ఎం.ఖజూంఎ్ష్ట్రవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ నుంచి హాల్‌ టికెట్లను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చునని కార్యదర్శి తెలిపారు. పిహెచ్‌డి కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఆర్‌సెట్‌ పరీక్ష ఈ నెల 2 నుంచి 5 వరకు జరగనుంది.

ల్యాండ్‌ టైటిల్‌ యాక్ట్‌ రద్దుపై రెండో సంతకం

- చేనేతలకు రూ.25వేలు సాయం - జిఎస్‌టి రద్దు
- టిటిడి అధినేత చంద్రబాబు




బాపట్ల జిల్లా చీరాలలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి- చీరాల, గుంటూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వచ్చాక మొదటి సంతకం డిఎస్‌సి పైనా, రెండో సంతకం టైటిల్‌ యాక్టు రద్దుపైనా చేస్తానని టిడిపి అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌.. ఏడాదికి రూ 25 వేలు ఆర్థిక సాయం అందిస్తామని, జిఎస్‌టిని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆస్తులను దోచుకునేందుకు సిఎం జగన్‌ ల్యాండ్‌ గ్రాబింగ్‌ యాక్ట్‌ తెచ్చారని, దీని ద్వారా ప్రజల ఆస్తులు ప్రజలవి కాకుండా పోతాయన్నారు. రికార్డులు తారుమారవుతాయని చెప్పారు. ప్రజాగళంలో భాగంగా చీరాల, గుంటూరులో నిర్వహించిన బహిరంగ సభల్లో చంద్రబాబు మాట్లాడారు. వైసిపి అధికారంలోకి రాకపోయి ఉంటే ఇప్పటికే అమరావతి నిర్మాణం పూర్తయ్యి ఉండేదన్నారు. అమరావతి అవుటర్‌ రింగు రోడ్డు నిర్మాణం జరగాలని ప్రణాళిక రూపొందిస్తే దానిని వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేసిందన్నారు. అమరావతిలో విలువైన భూములు ఉండటం వల్ల భూసమీకరణ పథకం అమలు చేశామని తెలిపారు. 29 వేల మంది 35 వేల ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారని, అమరావతి నిర్మాణం ఆగిపోవడం వల్ల గుంటూరు, కృష్ణా జిల్లాల్లో భూముల విలువ పడిపోయిందని, ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్యబీమా అమలు చేస్తామని తెలిపారు. చీరాల చరిత్ర కలిగిన ప్రాంతమని, పెంచిన పన్నులను కట్టేది లేదంటూ 1919లో బ్రిటీష్‌ వారిని ఎదిరించి చీరాల-పేరాల ఉద్యమాన్ని నడిపిన చరిత్ర చీరాల వాసులది అని గుర్తుచేశారు. అలాంటి చీరాల ప్రజానీకంపై పన్నులతో అధిక భారాలు మోపుతున్న జగన్‌ను పారద్రోలేందుకు ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్‌ గుర్తుకు ఓటు వేసి టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జగన్‌ ఒక వ్యాపారి, దళారీలా వ్యవహరిస్తూ ప్రజలను పన్నులతో పీడించారని, చివరికి ఛీప్‌ లిక్కర్‌ ధరలు కూడా పెంచారని విమర్శించారు. జగన్‌ పాలనలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం నిలిచిపోయిందన్నారు. సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, వర్క్‌ఫ్రం హోం సౌలభ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. టిడిపికి మొదటి నుంచి వెన్నుదన్నుగా ఉన్న బిసిల కోసం బిసి డిక్లరేషన్‌ తెస్తామని చెప్పారు. 50 సంవత్సరాలకే వారికి పింఛను ఇస్తామని, మండల కేంద్రాల్లో జనరిక్‌ మెడికల్‌ షాపులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో సంపద సృష్టించి.. ఆదాయం పెంచి.. దాన్ని పేదలకు పంచుతామన్నారు. సభల్లో ఆయా ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు పాల్గొన్నారు.





సన్మానం

రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ ఛైర్మన్‌ ద్వారకనాథరెడ్డి, వైస్‌ ఛైర్మన్‌ కృష్ణమోహన్‌ను ఘనంగా సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం

సిఎం బటన్‌ నొక్కి 48 రోజులు...

నేటికీ అకౌంట్లలో జమకాని ఇబిసి నేస్తం నిధులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్‌ ఇబిసి నేస్తం పథకం నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో నేటికీ జమకాకపోవడం పట్ల పేదల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాది బటన్‌ నొక్కినట్లే ఈ ఏడాది మార్చి 14న నంద్యాల జిల్లా బనగానపల్లిలో సిఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌ నొక్కి ఈ పథకానికి నిధులు విడుదల చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేసి ఉంటే రూ.629.37కోట్లు 4,19,583 మంది లబ్ధిదారుల అకౌంట్లలో ఇప్పటికే జమ అయిఉండాలి. అయితే, బటన్‌ నొక్కి సుమారు 48 రోజులు కావస్తున్నా నేటికీ లబ్ధిదారుల బ్యాంక్‌ అకౌంట్లలో నిధులు జమచేయకపోవడమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పోలింగ్‌కు కేవలం 12 రోజులే గడువు ఉన్నా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్‌ నెల 4వరకు అమల్లో ఉండనుంది. ఈ నేపథ్యంలో నిధులు విడుదలకు ఎన్నికల కమిషన్‌ అనుమతి తప్పనిసరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సహజంగా ఏ పథకానికి సంబంధించిన నిధులైనా సిఎం బటన్‌ నొక్కిన మూడు నాలుగు రోజుల్లో లబ్ధిదారుల బ్యాంక్‌ ఖాతాల్లో నిధులు జమ అవుతుండగా ఈ సారి దానికి భిన్నంగా జరిగింది.

కడప కోర్టు ఉత్తర్వులపై కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు గురించి సిఎం వైఎస్‌ జగన్‌తో ముడిపెడుతూ మాట్లాడవద్దంటూ కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని దాఖలైన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ జస్టిస్‌ జి నరేందర్‌, జస్టిస్‌ ఎన్‌ హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. కడప కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత, ఎపిసిసి అధ్యక్షులు షర్మిల, పులివెందుల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిటెక్‌ రవి వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. ఇరుపక్షాలు లీగల్‌ సబ్మిషన్లను మార్చుకోవాలని, శుక్రవారం విచారణకు సిద్ధంగా ఉండాలని హైకోర్టు ఆదేశించింది.

ప్రతివాదులుగా శిరోముండనం బాధితులు

దళితులకు శిరోముండనం చేయించారనే కేసులో విశాఖ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలంటూ వైసిపి ఎమ్మెల్సీ, మండపేట అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఇతర దోషులు దాఖలు దాఖలు చేసిన పిటిషన్‌లో శిరోముండనం బాధితులను ప్రతివాదులుగా చేర్చారు. దోషులు వేసిన అప్పీళ్లపై అభ్యంతరాలు దాఖలు చేసేందుకు బాధితులకు అవకాశం కల్పించింది. విచారణను ఈ నెల 7కు వాయిదా వేస్తూ జస్టిస్‌ టి మల్లికార్జునరావు ఆదేశాలిచ్చారు.

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల కేసుల వివరాలు

సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా చట్టసభకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమపై ఉన్న నేరచరిత్ర, ఆస్తుల వివరాలను ఆయా పార్టీలు వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని హైకోర్టు స్పష్టం చేసింది. స్వతంత్రంగా పత్రికల్లో ప్రచురించుకోవాలని కూడా చెప్పింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనా స్వచ్ఛంధంగా పత్రికల్లో ప్రచురించారో లేదో తెలుసుకుని వివరించేందుకు సమయం కావాలని హైకోర్టు ప్రశ్నకు సమాధానంగా ఇసి న్యాయవాది చెప్పారు. ఇందుకు చీఫ్‌ జస్టిస్‌ ధీరజ్‌సింగ్‌ ఠాకూర్‌, జస్టిస్‌ ఆర్‌ రఘునందన రావుతో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పూర్వ చరిత్ర, క్రిమినల్‌ కేసుల వివరాలు, ఆస్తులకు సంబంధించి సమర్పించే ఫారం 26ను ప్రజలకు తెలుగులో అందుబాటులో ఉంచేలా ఇసికి ఉత్తర్వులు ఇవ్వాలంటూ తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు, వైద్యుల సామల రమేష్‌ బాబు దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు పై విధంగా స్పందించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

హిందూ రాజ్యం... రిజర్వేషన్ల రద్దు

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నారని అన్నారు. 2004లో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం వల్లే రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం తప్పిందని చెప్పారు. తాను సోషల్‌ మీడియలో ఎటువంటి పోస్ట్‌ షేర్‌ చేయలేదని, బహిరంగంగానే వాస్తవాలను చెబుతున్నానని అన్నారు. కేసులకు, అరెస్టులకు తాను భయపడనన్న సంగతి తెలుంగాణ సమాజం మొత్తానికి తెలుసన్నారు.

'లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేస్తే రిజర్వేషన్ల రద్దుకు ఉపయోగపడుతుంది. రిజర్వేషన్లు పెరగాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటు వేయండి.' అని ఆయన అన్నారు. 'ఎన్‌డిఎ గెలిపిస్తే రాజ్యాంగ స్వరూపాన్ని మార్చేస్తుంది, ఇండియా వేదికను గెలిపిస్తే రాజ్యాంగానికి రక్షణగా ఉంటుంది. ఎటువైపు నిలబడాలో దళిత, గిరిజన, ఒబిసి, మైనార్టీలు నిర్ణయించుకోవాలి.' అని రేవంత్‌రెడ్డి కోరారు.

ప్రజామోదయోగ్యంగా మ్యానిఫెస్టో

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి మ్యానిఫెస్టో ప్రజా ఆమోదయోగ్యంగా ఉందని ప్రజలు చెబుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఈ మ్యానిఫెస్టోతో ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. జూమ్‌ యాప్‌ ద్వారా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సహజ వనరులను ఉపయోగించుకుంటే ప్రభుత్వానికి చాలా ఆదాయం చేకూరుతుందని తెలిపారు. ఉన్న వనరులను ఉపయోగించుకుని ప్రైవేటుపరమవుతున్న ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు మళ్లించి ఆదాయం పెంచవచ్చని తెలిపారు.

రైతులకు పెద్దపీట : శ్రీనివాసరెడ్డి

రైతులకు టిడిపి పెద్దపీట వేస్తుందని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రతి ఎకరాకూ నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌ అవగాహన లోపం, బాధ్యతా రాహిత్యంతో వ్యవసాయ రంగం కుదేలైందని విమర్శించారు. హిందువులు, బ్రాహ్మణులకు కూటమి అద్భుత హామీలిచ్చిందని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అదాని, అంబానీలకు పంచి పెడతారా?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోందన్నారు. వీటిని కాపాడుకోడానికి కార్మికులు పోరాడుతున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ముస్లిం రిజర్వేషన్‌పై చంద్రబాబు మౌనంగా ఉన్నారన్నారు. ముస్లిములను కాపాడే బాధ్యత తనదేనని చెబుతున్నారని, మోడీకి మద్దతు ఇస్తూ వారిని ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. మోడీకి చంద్రబాబు, జగన్‌ లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారని వివరించారు. వీరు మైనార్టీలను ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో జరిగిన ఘర్షణల్లో మైనార్టీలకు అండగా ఉన్నది సిపిఎం, కాంగ్రెస్‌ పార్టీలేనని వివరించారు. కేరళలో అనేక కుల, మత పార్టీలు ఉన్నా వామ పక్ష ప్రభుత్వం మత ఘర్షణలు జరగకుండా చూస్తోందన్నారు. వైసిపి. టిడిపి, జనసేన పార్టీలను నమ్మొద్దన్నారు. ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్‌, సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్‌ అభ్యర్థి కె.రాజు, సిపిఎం అభ్యర్థి మూలం రమేష్‌, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, డిసిసి అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ప్రసంగించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న లోతా రామారావు



కర్నూలు జిల్లా కల్లూరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న పాణ్యం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్

ప్రజలతో ముచ్చటిస్తూ.. కార్మికులతో మమేకమై..

- సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సిపిఎం అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. బుధవారం ఆయా నియోజకవర్గాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. ప్రజలతో ముచ్చటిస్తూ కార్మికులతో మమేకమవుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రచారం సాగించారు. సమస్యల పరిష్కారం కోసం సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్, ప్రకాష్‌నగర్, శాంతినగర్, గవర్నర్‌పేట, బీసెంట్ రోడ్లలో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్ బాబూరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొని పతాకాలను ఆవిష్కరించారు. ఆలీబేగ్ స్ట్రీట్‌లో రిక్షా తొక్కుతూ కార్మికులను ఉత్సాహపరిచారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో దోపిడీని ఎదుర్కొని, పాలకుల విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గం సమైక్యతతో ముందుకు సాగాలని కోరారు. శ్రామికుల శ్రమ లేనిదే సంపద, సమాజం లేదని పేర్కొన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. దోపిడీదార్లకు అండగా నిలుస్తున్న పాలకుల నిజస్వరూపాన్ని గమనించాలని కోరారు.

కృష్ణా జిల్లా గన్నవరంలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కృష్ణ ప్రచారం నిర్వహిస్తూ... గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన వైసిపికి గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి నేతలు ఒకరినొకరు తిట్టుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా ఆలోచించి ఓటు వేయకపోతే దేశం, రాష్ట్రం సర్వనాశనం అవుతాయని హెచ్చరించారు.

కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ సూర్యనారాయణ దేవాలయం, బాలాజీ నగర్, విజి నగర్, శారద నగర్, శ్రీలక్ష్మి నగర్, విద్యా నగర్, రుక్మిణి నగర్ ప్రాంతాల్లో పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కర్నూలు నగరాన్ని దౌర్జన్యకారుల నుంచి కాపాడతామని, సిపిఎంను గెలిపిస్తే అక్రమ కబ్జాలను ఆపి అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఓటర్లకు తెలిపారు. నగరంలో రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు రోడ్ షో నిర్వహించారు. తొలుత ముగ్గురోడ్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముగ్గురోడ్డు నుంచి ప్రారంభమైన రోడ్ షో ఆర్ఎంఎస్ కాలనీ, లంబాడీపేట, పోతురాజుస్వామి గుడి, మున్సిపల్ జోనల్ కార్యాలయం, పద్మశాలీ బజార్, ఉండవల్లి సెంటర్ మీదుగా పోలకంపాడు వరకు సాగింది. ఈ సందర్భంగా పాస్టర్లు, చిరువ్యాపారులు, ఆటోడ్రైవర్లు జొన్నా శివశంకరరావుకు మద్దతు తెలిపారు. పోలకంపాడు, బాపనయ్యనగర్ ప్రాంత వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కించుమండ వారపుసంతలో అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స దుకాణదారులను, ప్రజలను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లోనూ ప్రచారం చేపట్టారు. గిరిజన బతుకులు బాగుపడాలంటే, హక్కులు, చట్టాలకు రక్షణ ఉండాలంటే పార్లమెంటు, అసెంబ్లీలో ప్రశ్నించే వ్యక్తి ఉండాలని అన్నారు.

చింతూరు మండలంలో రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు రోడ్‌షో నిర్వహించారు. ఎర్రంపేట గ్రామం నుండి ప్రారంభమైన రోడ్‌షోలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్‌డి.హబీబ్ పాల్గొన్నారు. ప్రచార వాహనంపై లోతా రామారావు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, ఆదివాసీల హక్కులు, చట్టాల రక్షణకు రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి రామారావును, అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. బండారు రవి కుమార్ మాట్లాడుతూ బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు.

విశాఖలోని ఫకీర్‌తక్యా, షీలానగర్ తదితరచోట్ల గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించాలని కోరుతూ సిపిఎం కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో కురుపాం నియోజకవర్గ అభ్యర్థి మండంగి రమణ రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బారావమ్మ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ, అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స గెలిపించి గిరిజన హక్కులను కాపాడుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

బిజెపితో దేశానికి ముప్పు

- రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

బిజెపితో దేశానికి ముప్పు పొంచి ఉందని, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే కుట్రలు జరుగుతున్నాయని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. దేశంలోని మైనారిటీలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు, మేధావులు, విద్యావంతులు ఈ విషయాలను లోతుగా అవగాహన చేసుకుని సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని, దానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదికలోని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అధ్యక్షతన బుధవారం ప్రజా అవగాహన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తోందన్నారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చూస్తున్నారని విమర్శించారు. రైతాంగం, కార్మికుల పట్ల నిర్బంధాన్ని ప్రయోగిస్తూ హక్కులను కాలరాస్తున్నారన్నారు. చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మార్చి వేశారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఐదో షెడ్యూల్లో పేర్కొన్న అంశాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ గిరిజనుల భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాజెక్టుల పేరిట వాటిని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు యత్నిస్తున్నారని అన్నారు. ఆ చర్యలను వ్యతిరేకించకపోతే గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు. సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.విజయరావు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీని, దాని తొత్తు, పొత్తు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రజాప్రతినిధుల్లో ఏ ఒక్కరూ ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని ప్రశ్నించిన దాఖలాలులేవన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు పరస్పరం విమర్శించుకోవడానికే పరిమితమవుతున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మోడీ ప్రయివేటుపరం చేస్తుంటే రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు, మాజీ ఐఎఎస్ అధికారి శ్రీనివాస్, రంగారెడ్డి, విభజన హామీల సాధన సమితి నాయకులు అప్పలనాయుడు, సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కేసులో దర్యాప్తు వేగవంతం

- వాయిస్ రికార్డ్ స్వాధీనం
- ఆస్పత్రిని పరిశీలించిన పోలీసులు

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

విజయవాడ నగరంలోని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ డి.శ్రీనివాస్ ఆత్మహత్య, కుటుంబ సభ్యుల హత్య కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. విజయవాడ పటమట పోలీసులు బుధవారం శ్రీనివాస్ సొంతంగా పుష్పా హోటల్ సెంటరులో ఏర్పాటు చేసుకున్న శ్రీజ హాస్పిటల్‌ను పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది నుండి వివరాలు సేకరించారు. డాక్టర్ శ్రీనివాస్ గదిని, కంప్యూటర్‌ను, ఆయన కారులో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లనూ పరిశీలించారు. కారులో రూ.16 లక్షల నగదుతోపాటు 300 గ్రాముల బంగారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో శ్రీజ ఆస్పత్రిని ఇటీవలే మరో ఆస్పత్రి యాజమాన్యానికి అప్పగించారు. ఆస్పత్రిని ఎందుకు ఇచ్చారు? ఏ విధమైన లావాదేవీలు జరిగాయనే విషయమై విచారణ జరుపుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో విచారణ కొలిక్కివచ్చే అవకాశం ఉన్నట్లు పోలీసులు చెప్తున్నారు.

ఒత్తిడికి తలొగ్గి కుటుంబాన్ని కడతేర్చి..

'నా మానసిక పరిస్థితి బాగోలేదు. చాలా ఒత్తిడిలో ఉన్నా. అమ్మ, భార్య, పిల్లలంటే నాకు ప్రాణం. నేను చనిపోయాక వారిని ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు. అందుకే ఇలా చేశాను' అని డాక్టర్ శ్రీనివాస్ తన ఫోన్లో రికార్డు చేసిన వాయిస్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

అక్కడక్కడే తిరిగిన జాగిలం

కుటుంబ సభ్యులను చంపేందుకు ఉపయోగించిన కత్తులను సమీప సూపర్ మార్కెట్లో కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించి అక్కడి సిసి కెమెరాల దృశ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలం వద్ద పోలీసు జాగిలం శ్రీనివాస్ ఇంటి నుంచి బయటకు వచ్చి, ఎదురుగా ఉన్న ఇంట్లోకి వెళ్లి బయటకు వచ్చింది. ఆ తర్వాత రోడ్డు పక్కన నిలిపిన కారు వద్దకు వచ్చి మళ్లీ వెనుదిరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సిసి కెమెరాల్లో దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

అంత్యక్రియలు పూర్తి

వైద్యుడు శ్రీనివాస్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల మృతదేహాలకు నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం మధ్యాహ్నం బంధువులకు అప్పగించారు. అనంతరం కృష్ణలంక స్వర్గపురిలో అంత్యక్రియలు నిర్వహించారు. చివరిసారిగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులను చూసేందుకు బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ప్రభుత్వాస్పత్రి వద్దకు వచ్చారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కార్మిక సంక్షేమానికి పెద్దపీట

- మేడే శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ కష్టంతో ప్రగతిపూర్వక సమాజ నిర్మాణానికి చేయూతనిచ్చే శ్రామికుల హక్కులను కాపాడటంలో టిడిపి ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. మే డే సందర్భంగా కార్మికలోకానికి శుభాకాంక్షలు చెబుతూ బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దోపిడీని ఎదిరించి శ్రమ శక్తి గెలుపొందిన మహోజ్వల చారిత్రాత్మక దినం మేడే అని ఆయన పేర్కొన్నారు. తాము విడుదల చేసిన మ్యానిఫెస్టోలో కూడా కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు.

బిజెపికి తొత్తులుగా చంద్రబాబు, జగన్

- ఆశీర్వదించండి.. సేవకురాలిగా ఉంటాను
- ఎన్నికల ప్రచారంలో పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- కాశినాయన (వైఎస్ఆర్ జిల్లా)

బిజెపికి తొత్తులుగా ఉంటూ రాష్ట్రాన్ని చంద్రబాబు, జగన్ సర్వనాశనం చేస్తున్నారన్నారని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విమర్శించారు. తాను పోటీచేస్తున్న కడప ఎంపి పరిధిలోని బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలం నుంచి బుధవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు మండలాల్లో ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో షర్మిల మాట్లాడుతూ.. తనను కడప ఎంపిగా గెలిపిస్తే కేంద్రంలో మంత్రిని అవుతానని, ప్రత్యేక హోదా సాధిస్తాని, ఒక్కసారి నన్ను ఆశీర్వదించి నాకు ఓటేసి గెలిపిస్తే మీకు సేవకురాలుగా పని చేస్తానని అన్నారు. వైఎస్ఆర్‌కు జగన్ వారసుడు ఎలా అవుతారని, వైఎస్ఆర్ ఆశయాలను ఒక్కటైన అమలు చేశారా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉండి కూడా రైతులను అప్పుల పాలు చేశారని విమర్శించారు. వైఎస్ఆర్ హయాంలో వ్యవసాయం పండుగలాగా ఉండేదని, నేడు రాష్ట్రంలో అప్పు లేని రైతు లేరని చెప్పారు. నిరుద్యోగ బిడ్డలను వంచనకు గురిచేశారని,. 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి, ఐదేళ్ల అధికారం అనుభవించి ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో 2.25 లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. కడప ఎంపిగా ఆనాడు వైఎస్ఆర్, వైఎస్ వివేకా గెలిచారని, ఇప్పుడు వైఎస్ఆర్ బిడ్డ కడప ఎంపిగా పోటీ చేస్తోందన్నారు. సోమశిల ఎత్తిపోతల పథకం ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరిస్తామని చెప్పారని, ఇప్పటికీ ఒక్క చుక్క కూడా నీరివ్వలేదని చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని వీళ్ల మనకు అవసరమా? అని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పదేళ్ల బిజెపి పాలనలో ప్రజలను పది నయవంచనాలకు ప్రధాని మోడీ గురిచేశారన్నారు. దేశంలో 15 శాతం ఉన్న మైనార్టీల్లో కేంద్ర క్యాబినెట్‌లో ఒక్క మంత్రి కూడా లేకపోవడం శోచనీయమన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ మాట్లాడుతూ.. వైసిపి పరిపాలన అంతా బిజెపి అడుగులకు మడుగులు వత్తడానికే సరిపోయిందన్నారు. రాష్ట్రంలో భూకబ్జాలు ఎక్కువయ్యాయని, ఒక చేత్తో వంద రూపాయలు ఇచ్చి మరో చేత వెయ్యి రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, కాంగ్రెస్ బద్వేలు ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.డి.విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల, పక్కన ఎన్.డి.విజయజ్యోతి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

'వివేకా' వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు

- వాసిరెడ్డి పద్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ వివేకానందరెడ్డి వ్యక్తిత్వాన్ని వైఎస్ షర్మిల, సునీత దెబ్బతీస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ విమర్శించారు. వైసిపి ఓటు బ్యాంకుకు గండికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సూచన మేరకే కాంగ్రెస్‌లో చేరి సిఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసులోకి అనవసరంగా భారతిని కూడా లాగుతున్నారని అన్నారు.

ముద్రగడ వ్యాఖ్యలు అహంకారపూరితం : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకార ధోరణికి నిదర్శనమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ విమర్శించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాపు ఉద్యమ నేతగా చెప్పుకునే ముద్రగడ.. కాపుల అభ్యున్నతికి ఇప్పటి వరకు ఏం చేశారో చెప్పాలన్నారు.

రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు

- రెండో రోజు 46 డిగ్రీల నమోదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భానుడు భగ..భగమంటున్నాడు. రాష్ట్రంలో రెండో రోజు ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. బుధవారం పల్నాడు జిల్లా కొప్పునూరులో 46.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 46 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా చిల్లకల్లులో 45.8, నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా మర్రిపాడులో 45.7 డిగ్రీలు, చిత్తూరు జిల్లా కొత్తపల్లిలో 45.5, కడప జిల్లా సింహాద్రిపురంలో 44.9, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 44.5, కర్నూలు జిల్లా పంచలింగాలలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రాష్ట్రం మొత్తం నిప్పుల కొలిమిగా మారింది. 79 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 118 మండలాల్లో వడగాడ్పులు నమోదయ్యాయి.



రాష్ట్ర వ్యాప్తంగా గురువారం 31 మండలాల్లో తీవ్రగాడ్పులు, 234 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడగాడ్పులు వీచే మండలాల్లో ప్రజలు అప్రమత్తంగా వుండాలని, అత్యవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆయన కోరారు.

వలంటీర్ కావాలా? ఐటీ ఉద్యోగం కావాలా?

- విజన్ ఉన్న నేత చంద్రబాబు : లోకేష్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే మూడేళ్లలో నెల్లూరుకు ఎయిర్‌పోర్టు తెస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. రూ.ఐదు వేలు ఇచ్చే వలంటీర్ కావాలా? రూ.50 వేలు వచ్చే ఐటీ ఉద్యోగం కావాలా? అనేది యువత ఆలోచించాలని కోరారు. యువగళంలో భాగంగా బుధవారం నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో యువతతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి హాట్‌నెట్ సోషల్ మీడియా ఫౌండర్, మోటివేషన్ స్పీకర్ ఫ్రెడ్రిక్ దేవరంపాటి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జగన్‌కు తెలిసింది దోచుకోవడం, దాచుకోవడం మాత్రమేనని విమర్శించారు. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు భారతి సిమెంట్, సాక్షి పేపర్ స్థాపించారని, సిఎం అయ్యాక మద్యం, ఇసుక గ్రావెల్ ద్వారా యథేచ్ఛగా దోచుకున్నారని విమర్శించారు. అనంతపురంలో పాదయాత్ర చేసేటప్పుడు ఓ చెల్లి తనను కలిసిందని, కియాలో ఉద్యోగం చేస్తూ నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నానని చెప్పిందన్నారు. ఇప్పుడు ఆమె ఏటా 3.5లక్షల జీతం అందుకుంటోందని, ఇది చంద్రబాబునాయుడు విజనరీ అన్నారు. బటన్ నొక్కడమే సిఎం బాధ్యత కాదని, ముఖ్యమంత్రికి విజన్ ఉండాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సంపద సృష్టి ద్వారా వచ్చే ఆదాయాన్ని నిరుపేదలకు పంచి పేదరికం నుంచి బయటకు తెచ్చేందుకు ఖర్చుపెడతామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని, కార్మిక, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు కూడా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నెల్లూరును మాజీ మంత్రి నారాయణ ఎలా అభివృద్ధి చేశారో చూశామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, యువత, ప్రజల కోసమే బిజెపి, జనసేనతో టిడిపి పొత్తు పెట్టుకుందన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి పి.నారాయణ, నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తోపాటు యువత పాల్గొన్నారు.



యువతతో ముఖాముఖిలో మాట్లాడుతున్న లోకేష్

కళ్లు చెదిరే జిఎస్‌టి వసూళ్లు

- ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లు
- ఆల్‌టైం రికార్డ్ రాబడి

న్యూఢిల్లీ : దేశంలో రికార్డ్ స్థాయిలో అమాంతం పెరిగిన పన్ను వసూళ్లు ప్రభుత్వ ఖజానాను నింపివేస్తున్నాయి. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. గతేడాది ఏప్రిల్‌తో పోల్చితే గడిచిన నెలల్లో ప్రభుత్వాలకు జిఎస్‌టి రాబడి రూ.2.10 లక్షల కోట్లకు చేరింది. దేశీయ లావాదేవీలు, దిగుమతుల్లో బలమైన వృద్ధి, జిఎస్‌టి వసూళ్లు పెరగడానికి కారణమని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2017 జూలైలో జిఎస్‌టి అమలులోకి వచ్చాక నెలవారీ వసూళ్లకు సంబంధించి ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. ఇప్పటి వరకు గతేడాది ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు రికార్డ్‌గా ఉంది. అదే విధంగా రూ.13,260 కోట్లు సెస్ వసూలైంది. జిఎస్‌టితో దేశంలో సరుకుల ధరలు తగ్గుతాయని.. బిజెపి ప్రభుత్వం తొలుత పేర్కొంది. దీనికి భిన్నంగా ధరలు ఎగిసిపడి ప్రజల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు మోడీ సర్కార్ ఖజానా పంట మాత్రం పండుతోంది.

ఎంఎఫ్ జాయింట్ ఖాతాలకు నామినీ తప్పనిసరి కాదు

- సెబీ కొత్త నిర్ణయం

ముంబయి: మ్యూచువల్ ఫండ్‌లో సంయుక్తంగా నిర్వహించే ఖాతాలకు నామినీ ఎంపిక తప్పనిసరి ఏమీ కాదని సెబీ స్పష్టం చేసింది. ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులను మరింత సులభతరం చేసే ఉద్దేశ్యంతో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎవరైనా ఒకరికి జరగకూడనిది జరిగిన సమయంలో నిధుల బదిలీ సహా ఇరత ప్రక్రియలు సులువవుతాయని పేర్కొంది. జీవించి ఉన్న సభ్యుడిని నామినీగా చేర్చడాన్ని ఈ నిబంధన అవకాశం కల్పిస్తుందని సెబీ పేర్కొంది. అదే విధంగా కమొడిటీ, విదేశీ పెట్టుబడుల పర్యవేక్షణకు ఒకే ఫండ్ మేనేజర్ ఉండటానికి ఫండ్ హౌస్‌లకు అనుమతించింది.

తగ్గిన యుపిఐ లావాదేవీలు



న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో డిజిటల్ నగదు చెల్లింపు (యుపిఐ) లావాదేవీలు 0.7 శాతం తగ్గి రూ.19.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం మార్చిలో విలువ పరంగా రూ.19.78 లక్షల కోట్ల లావాదేవీలు చోటు చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా అంటూ ఊదరగొడుతున్న నేపథ్యంలో నిజంగా ఇది ప్రాధాన్యత గల అంశమే. సంఖ్యా పరంగా ఏప్రిల్‌లో 1330 కోట్లు, మార్చిలో 1344 కోట్ల చొప్పున లావాదేవీలు జరిగాయి. మరోవైపు గత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఎటిఎంల నుంచి నెలవారీ నగదు ఉపసంహరణల సగటు రూ.1.43 కోట్లుగా ఉందని ప్రముఖ క్యాష్ లాజిస్టిక్స్ కంపెనీ సిఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ ఇటీవల తెలిపింది. 2022-23తో పోల్చితే 2023-24లో ఎటిఎంల్లో 5.51 శాతం నగదు ఉపసంహరణలు పెరిగాయి.

అనంత్‌నాగ్ ఎన్నిక వాయిదాపై విమర్శల వెల్లువ

- ఓటింగ్ సరళిని మార్చేందుకే .. : ముఫ్తీ, ఒమర్
- ఇసి విశ్వసనీయతనే దెబ్బ తీస్తుంది : సిపిఎం



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానం ఎన్నికను ఎన్నికల కమిషన్ (ఇసి) వాయిదా వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 7న జరగాల్సిన అనంత్‌నాగ్ లోక్‌సభ ఎన్నికను ఈ నెల 25కు ఇసి మంగళవారం వాయిదా వేసింది. ఇసి నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. అనంత్‌నాగ్ ఎన్నికను వాయిదా వేయిడం ఇసి విశ్వసనీయతను దెబ్బతీస్తుందని సిపిఎం నాయకులు ఎం.వై. తరిగామి విమర్శించారు. ఇసి నిర్ణయంపై పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తీ, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఒమర్ అబ్దుల్లా అనేక ప్రశ్నలు సంధించారు. ఓటింగ్ సరళిని మార్చే లక్ష్యంతోనే ఇసి ఈ ఎన్నికను వాయిదా వేసిందని విమర్శించారు. 'అనేక పార్టీల విజ్ఞప్తి మేరకు అనంత్‌నాగ్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఇసి ప్రకటించింది. ఇది బిజెపి కుట్ర. ఎన్నిక వాయిదా విషయంలో అభ్యర్థులకు, ఓటర్లకు సంబంధం లేదు. బిజెపి దాని మిత్రపక్షాలు మాత్రమే వాయిదా గురించి మాట్లాడుతున్నాయి. మేలో ఎగువ ప్రాంతాలకు వలస వెళ్లే ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనకుండా చేయడానికే ఎన్నికను వాయిదా వేశారు. ఓటింగ్‌లో పాల్గొన్న తరువాతే వారంతా వలస వెళతారని నేను నమ్ముతున్నాను' అని అబ్దుల్లా తెలిపారు.

రాజౌరిలో ఎన్నికల సభలో ముఫ్తీ మాట్లాడుతూ 'బిజెపి, దాని మిత్రపక్షాలకు అనుకూలంగా ఓటు వేసేందుకు, ఓటు హక్కు వినియోగించుకోకుండా ప్రజలను భయపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగానే ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు' అని ముఫ్తీ విమర్శించారు.

ఇసి నిర్ణయానికి వ్యతిరేకంగా శ్రీనగర్‌లో బుధవారం పిడిపి వీధి నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ నిరసనలో పార్టీ సీనియర్ నాయకులు నయీమ్ అక్తర్ మాట్లాడుతూ 'ఇది ఎన్నికలకు ముందు జరిగిన రిగ్గింగ్. తనకు వ్యతిరేకంగా పరిస్థితి ఉందని బిజెపి గుర్తించింది. దురదృష్టవశాత్తు బిజెపికి ఇసి సాధనంగా మారింది. ఏ నివేదిక ఆధారంగా ఎన్నికలను వాయిదా వేశారో ఆ నివేదికను బహిర్గతం చేయాలి' అని డిమాండ్ చేశారు.

ఇసి నిర్ణయాన్ని బిజెపి, జమ్ముకాశ్మీర్ అప్నీ పార్టీ (జెకెఎపి), జమ్ముకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్, గులాం నబీ అజాద్‌కు చెందిన డెమొక్రాటిక్ ప్రొగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డిపిఎపి) స్వాగతించాయి.

70 కోట్ల మంది నిరుద్యోగంతో బాధపడుతున్నారు : ప్రియాంక



దిస్పూర్ : మోడీ సర్కార్ ప్రజా సమస్యల్ని విస్మరించి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు. అసోంలోని దుబ్రిలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రియాంక మాట్లాడుతూ.. 'కాషాయ పాలకులు ప్రజల ఇబ్బందులు పట్టించుకోరు. ఈరోజు దేశంలో నిరుద్యోగం అత్యధికంగా ఉంది. యువత ఉద్యోగాలు లేక తీవ్రంగా సతమతమవుతోంది' అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో 70 కోట్ల మంది నిరుద్యోగంతో బాధపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని మోడీ సర్కార్ సమాజంలో విభజన చిచ్చు రేపుతోంది. ఈ ఎన్నికల్లో 'ఇండియా' అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

అమేథీ, రాయ్‌బరేలీ అభ్యర్థులపై 24 గంటల్లో నిర్ణయం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే రెండు దశల ఎన్నికలు ముగిసాయి. అయినప్పటికీ కాంగ్రెస్ రాయబరేలీ, అమేథీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటివరకూ ఈ స్థానాల్లో అభ్యర్థుల్ని ఖరారు చేయకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాల అభ్యర్థుల పేర్లను 24 గంటల్లో ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే చెబుతున్నారు. ఈ విషయంలో ఎవరూ భయపడొద్దని ఆ పార్టీ నేత జైరాం రమేష్ తెలిపారు. కాగా 2019లో అమేథీలో రాహుల్‌గాంధీని బిజెపి నేత స్మృతి ఇరానీ ఓడించారు. ఈసారి కూడా స్మృతి ఇరానీ ఈ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ మరోసారి ఈ స్థానం నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నారు. అమేథీ స్థానానికి ఐదో దశలో మే 20న ఎన్నికలు జరగబోతున్నాయి.

- జెజెపి, బిజెపి పొత్తు విచ్ఛిన్నం
- సిఎం ఖట్టర్ మార్పు
- రైతు, రెజ్లర్ల ఆందోళనల ప్రభావం
- గత ఎన్నికలకు భిన్నంగా ఇండియా బ్లాక్‌లో భాగంగా కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ

సార్వత్రిక ఎన్నికల్లో హర్యానా రాజకీయం రసవత్తరంగా ఉంది. పది లోక్‌సభ స్థానాలున్న హర్యానాలో ఆరో విడత (మే 25)లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు ముందు రాజకీయ సంక్షోభం తలెత్తింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి, దుష్యంత్ చౌతాలాకు చెందిన జననాయక్ జనతా పార్టీ(జెజెపి) మధ్య విభేదాలు తలెత్తాయి. ఇండియా ఫోరంలో భాగంగా ఇక్కడ కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తున్నాయి. జెజెపి, ఐఎన్‌ఎల్‌డి ప్రాంతీయ పార్టీలు కూడా పోటీ చేస్తున్నాయి.



దుష్యంత్‌చౌతాలా



మనోహర్‌లాల్ ఖట్టర్



బిజెపిని హడలెత్తిస్తున్న హర్యానా

జె.జగదీష్

సిఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తొలగించి, బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడుగా ఉన్న నాయబ్‌సింగ్ సైనీని ప్రతిష్టించారు. దేవీలాల్ మునిమనుమడు దుష్యంత్‌చౌతాలా నేతృత్వంలో జన్‌నాయక్ జనతాపార్టీ (జెజెపి)తో ఐదేళ్లుగా కొనసాగుతున్న పొత్తును బిజెపి తెంచేసుకుంది. అసెంబ్లీలో పదిమంది సభ్యులున్న ఆ పార్టీతో తెగదెంపులు చేసుకొని, ఆ లోటు భర్తీకోసం ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురి మద్దతు తెచ్చుకుంది. ముఖ్యమంత్రిగా ఖట్టర్ నిక్షేపంగా కొనసాగవచ్చు. కానీ, అదే పాత మంత్రులు కొందరు తిరిగి ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ, ఖట్టర్ స్థానంలోకి సైనీ రావడం వెనుక చాలా లెక్కలూ వ్యూహాలూ ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల సీట్లపంపకాల్లో తేడాలు వచ్చి రెండుపార్టీలూ వేరుపడ్డాయి. 2019లో ఇక్కడి బిజెపి పది లోక్‌సభస్థానాలూ గెలుచుకుకోగా, ఈ ఎన్నికలకు కాస్తంత ముందు చౌతాలా కుటుంబంలో వచ్చిన విభేదాలతో ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డి)నుంచి దుష్యంత్ వేరుపడ్డారు. ఒక్కస్థానం కూడా ఆయన గెలవలేదు. దాంతో పొత్తులో ఉన్నప్పటికీ ప్రస్తుత ఎన్నికల్లో ఒక్కసీటు కూడా ఇవ్వబోమని దుష్యంత్‌కు బిజెపి నేతలు తేల్చి చెప్పారు. తమకు రెండు సీట్లు కావాలని జెజెపి నేత అడిగ్గా బిజెపి ససేమిరా అనడంతో జెజెపి పది స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో పొత్తు చెడింది. బిజెపి కూటమి నుంచి జెజెపి బయటపడింది.

మారిన జాట్లు

మోడీ మీద అభిమానంతోపాటు, పుల్వామా రగల్చిన 'దేశభక్తి' వంటివి బలంగా పనిచేశాయి. కానీ, ఈ మారు రైతు ఆందోళనలు, మహిళా మల్లయోధుల నిరసనలు, మద్దతు ధర ఉద్యమాలు సహా పలు కారణాలతో అధిక శాతం జాట్లు బిజెపి పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఖట్టర్ మీద మరీ కోపంగా ఉన్నారని చెబుతున్నారు. జాట్లు ఈ మారు కాంగ్రెస్ వైపు చూస్తున్న నేపథ్యంలో బిజెపి, జెజెపి కలిసి సాగితే ఇరువురికీ నష్టమేనని భావించారని తెలుస్తోంది. కాంగ్రెస్, ఐఎన్‌ఎల్‌డి, జెజెపి మధ్య జాట్ల ఓట్లు చీలిపోయిన పక్షంలో మిగతా అగ్రకులాల, ఒబిసిల ఓట్లతో తాను లబ్ధిపొందవచ్చునని, ఒబిసిల ఓట్లు సంపాదించడానికి కొత్త ముఖ్యమంత్రి ఉపకరిస్తారని బిజెపి భావించి ఆ సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది.

ఆకర్షిస్తున్న కాంగ్రెస్ కులగణన హామీ

రాహుల్ గాంధీ హామీ ఇస్తున్న కులగణన బిసిలను ప్రభావితం చేస్తున్నందున, దానికి విరుగుడుగా సైనీని బిజెపి ముందుకు తెచ్చింది. నాయబ్‌సింగ్ వచ్చినంతమాత్రాన ఒబిసిలంతా బిజెపికి ఓట్లువేయరన్న అంచనాలు అటుంచితే, హర్యానాలో సైనీలు 8 శాతం వరకూ ఉన్నారు. ఎన్నికలకుముందు ముఖ్యమంత్రిని మార్చివేయడం బిజెపి తన ఓటమిని ముందే అంగీకరించడంగా కాంగ్రెస్ అంటోంది. హర్యానాలో ఓబిసిలు 35 శాతం, ఎస్‌సిలు 20.17 శాతం, జనరల్ 45 శాతం ఉన్నారు. అందులో జాట్లు 25 శాతం, రాజ్ పుత్ 3.4 శాతం, పంజాబీ 8 శాతం ఉన్నారు.

ఎవరెన్ని స్థానాల్లో పోటీ

గత ఎన్నికల్లో పది స్థానాలకు పదింటిని గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది బిజెపి. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బిజెపి ఒంటరిగానే పది స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇండియా బ్లాక్‌లో భాగంగా కాంగ్రెస్ తొమ్మిది, ఆప్ ఒక స్థానంలో పోటీ చేస్తున్నాయి. జెజెపి ఒంటరిగానే పది స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధపడింది. ఇప్పటి వరకు ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఐఎన్‌ఎల్‌డి ఆరు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది.



రైతు పోరాటం.. రెజ్లర్ల ఆందోళన

మోడీ సర్కారు తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటంలో పంజాబ్ తరువాత హర్యానా కీలక పాత్ర పోషించింది. సంచలనంగా మారిన రెజ్లర్ల ఆందోళనకు కేంద్ర బిందువు కూడా హర్యానాయే. రైతులపై హర్యానా బిజెపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. పోలీసులతో అణచివేతలకు పాల్పడింది. ఈ ఎన్నికల్లో రైతుల ఉద్యమం, రెజ్లర్ల ఆందోళనలు ప్రభావం చూపనున్నాయి.



తొలి ఎన్నికల్లో ఒక్కో ఓటరుకు 60 పైసలు





- ఇప్పుడు సుమారు 60 రూపాయలు
- పెరుగుతున్న ఇ.సి. ఎన్నికల నిర్వహణ వ్యయం

ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారం. ఇంత విస్తారమైన జనాభాకు ఓటింగ్ నిర్వహించడానికి ప్రణాళిక అవసరం. సుమారు 97 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఈ ప్రక్రియలో అటు మానవవనరులతో పాటు ఇటు ఆర్థిక వనరులూ అవసరం. కొన్నేళ్లుగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణా ఖర్చులు క్రమంగా పెరుగుతున్నాయి.

1952లో ఎన్నికల కమిషన్ ఒక్కో ఓటరుకు 60 పైసల ఖర్చు చేసింది. ఇది అభ్యర్థులు సొంతంగా చేసిన వ్యయం కాదు. ఇ.సి. చేసిన ఖర్చు. తర్వాతి రెండు ఎన్నికల్లో ఆ ఖర్చును 30 పైసలకు తగ్గించింది. ఆ తదుపరి ఖర్చు 40 పైసలకు పెరిగింది. 1980లో ఇ.సి. ఖర్చు ఒక్కో ఓటరుకు రూ.1కి పెరిగింది. 2004లో రూ.17 కు చేరింది. 2009లో రూ.13కు తగ్గినా 2014లో ఒకేసారి మూడింతలు పెరిగి రూ.41.6 అయింది. ప్రస్తుతం సుమారు 60 రూపాయలవుతోందని ఒక అంచనా. 1951-52 మొదటి సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ వ్యయం రూ.10.5 కోట్లయింది. 2014లో వ్యయం రూ.3,870 కోట్లు. తొలి ఎన్నికలకు ఇప్పటికీ ఓటర్ల సంఖ్య పెరుగుదల, అందుకనుగుణంగా నిర్వహణా ఏర్పాట్లకు చేసే ఖర్చూ పెరుగుతూ వస్తోంది.

ఈవిఎంల ఖర్చు అధికం..

అధికారులు, సాయుధ బలగాల మోహరింపు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవిఎం), ఇంకు, అవగాహన కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారం వంటి వాటిపై ఎన్నికల కమిషన్ ఖర్చు చేస్తుంది. వీటన్నింటిలో ఈవిఎంలకు ఎక్కువ ఖర్చు పెడుతోంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ ప్రకారం ఈవిఎంల వినియోగంపై ఖర్చు గణనీయంగా పెరుగుతోందని వెల్లడించింది. 2019 బడ్జెట్‌లో కేంద్రం ఈవిఎంలపై రూ.25 కోట్లు కేటాయించింది. 2023 తాజా బడ్జెట్‌లో ఈవిఎంల కోసం రూ.1891 కోట్లు కేటాయించింది. కిందటి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రూ.611 కోట్ల గ్రాంట్‌ల కోసం అదనపు డిమాండ్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు.

ఈసి బడ్జెట్ కేటాయింపు..

ఎలక్షన్ ప్రక్రియలో అధికారుల శిక్షణా తరగతులకు రోజుకు రూ.350, పోలింగ్ సిబ్బందికి రోజుకు రూ.250 చొప్పున చెల్లిస్తున్నట్లు తాజా ఉత్తర్వులో ఈసి వెల్లడించింది. తొలి ఎన్నికల్లో 1,874 మంది అభ్యర్థులు 53 పార్టీల నుంచి పోటీలో ఉండగా 1,96,000 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అదే 2019లో 8,054 అభ్యర్థులు, 673 పార్టల నుంచి పోటీచేయగా పదిలక్షల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల పెరుగుదల, అభ్యర్థులు, ఓటర్ల, ఈసి సిబ్బంది పెరుగుదల వంటివి బడ్జెట్ పెంపునకు దారి తీస్తున్నాయి.





ఖర్చు ఎవరు భరిస్తారు..!

1979- హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లోక్‌సభ ఎన్నికల ఖర్చును కేంద్రమే భరిస్తుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరిగే రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చును కేంద్రం రాష్ట్రాలు సమానంగా పంచుకుంటాయి. ఏడు దశల్లో జరిగే ఈ సార్వత్రిక ఎన్నికల వ్యయం గత లోక్‌సభ ఎన్నికల కంటే భారీగా పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల ప్రకటన జారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు 82 రోజుల పాటు ప్రక్రియ కొనసాగనుంది.

కలం బాణాలు

రాష్ట్రంలో హిందువులపై ముప్పేట దాడి : శ్రీనివాసానంద సరస్వతి

హిందువులను రెచ్చగొట్ట
దింపుడుకళ్ళెం ఆశలు
ప్రజల్లోన చిచ్చుపెట్టు
కుటిల నీతి అహర్నిశలు

ఎపిలో ఈ ఆటలు
సాగవులే శ్రీనివాస
మతం పేరుతో ఓట్లు
రావండీ ఆశ, దోస



నా పేరు పద్మనాభరెడ్డిగా మార్చుకుంటా : ముద్రగడ



ఓడిపోతె పేరుమార్పు
ఎందుకులెండయ్య
ప్రజల తీర్పు వచ్చునులే
మీకూ పవనుకు మధ్య

పిఠాపురం పులివెందుల
సవాళ్ళన్ని కూడ
కుల ప్రాంత తగాదాలు
పెంచును కద చూడ

మేనిఫెస్టోకు మా పూర్తి సమ్మతి ఉంది బిజెపి రాష్ట్ర ఇంఛార్జి సిద్దార్థ సింగ్

సమ్మతి వుంటే గమ్మున
వున్నారే సిద్దార్థ
చెయ్యియినావెయ్యలేదు
బొమ్మలేదు మహాత్మా

దాగుడుమూతలతోనే
దగాచేయలేరు మీరు
దాగుడుమూతలతో మమ్ముల
దగాచెయ్యలేరు మీరు

\- తె.ర







సింహపురి బరి.. వ్యాపారుల గురి..!

- మరోవైపు ఇద్దరు సామాన్యుల పోరాటం


మూలం రమేష్


కొప్పుల రాజు


వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


విజయసాయి రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి


సింహపురి బరిలో అంతర్జాతీయ కాంట్రాక్టరు.. భారీ వ్యాపారులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. సహజ వసరులు దోచుకుని దాచుకున్నవారు జిల్లా రాజకీయాల్లో పెద్దయెత్తున ఖర్చులు పెడుతున్నారు. వైసిపి, టిడిపి తరపున అభ్యర్థులు రంగంలో ఉన్నారు. జిల్లాలో ఎన్నికల బరిలో 129 మంది పోటీ పడుతున్నారు. ఇందులో నెల్లూరు పార్లమెంటు నుంచి 14 మంది ఉన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలో ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. ఇందులో 115 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సింహపురిలో రాజకీయ యుద్ధమే సాగుతోంది. ఇలాంటి చోట ఇద్దరు వ్యక్తులు మాత్రమే, నీతి, నిజాయతీ, నిబద్ధత, సిద్ధాంతాలంటూ ప్రజలను చైతన్యం చేయడానికి కృషి చేస్తున్నారు. ఒకరు కాంగ్రెస్ పార్టీ తరపున సీనియర్ ఐఎఎస్ అధికారి కొప్పుల రాజు పోటీ చేస్తుండగా, నెల్లూరు నగరం నుంచి సిపిఎం అభ్యర్థిగా మూలం రమేష్ పోటీ చేస్తున్నారు. ప్రజలు వైసిపి, టిడిపి అభ్యర్థులతో కాంగ్రెస్, సిపిఎం అభ్యర్థులను బేరీజు వేసుకుం టున్నారు.

ఆ ఇద్దరూ బడా వ్యాపారులే..

ప్రస్తుతం నెల్లూరు పార్లమెంటు టిడిపి నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి నుంచి విజయసాయిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఆ ఇద్దరూ బడా వ్యాపారులే. కాంగ్రెస్ నుంచి కె రాజు పోటీ చేస్తున్నారు. రాజు నెల్లూరు కలెక్టరుగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. నెల్లూరు నగరంలో సిపిఎం అభ్యర్థిగా మూలం రమేష్, వైసిపి అభ్యర్థిగా ఖలీల్ అహ్మద్, టిడిపి నుంచి మాజీ మంత్రి పి నారాయణ బరిలో నిలిచారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య సిపిఎం అభ్యర్థి పోరాటమే చేస్తున్నారు. నెల్లూరు రూరల్‌లో వైసిపి అభ్యర్థిగా ప్రముఖ కాంట్రాక్టరు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టిడిపి నుంచి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. కోవూరు నియోజకవర్గంలో రసవత్తర పోరు సాగుతోంది. ఆరుసార్లు గెలిచి రికార్డు సృష్టించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైసిపి నుంచి పోటీ చేస్తుండగా, ప్రముఖ కాంట్రాక్టరు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి టిడిపి అభ్యర్థిగా ఉన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలో ఉన్నారు. టిడిపి నుంచి ఇంటూరు నాగేశ్వరరావు, వైసిపి నుంచి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఇద్దరు రియల్ ఎస్టేట్‌లో భారీగా సంపాదించి తమ రాజకీయ భవిష్యత్తు చూసుకుంటున్నారు. కాంగ్రెస్ నుంచి ముస్లిం నాయకులు గౌస్‌మొహిద్దీన్ పోటీలో ఉన్నారు. కావలి నియోజకవర్గంలోనూ ఇద్దరు బడా వ్యాపారులు నువ్వా.. నేనా.. అంటున్నారు. వైసిపి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రియల్ ఎస్టేట్, కాలేజీలు, నడుపు తుండగా, టిడిపి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి కాంట్రాక్టర్లుగా ఉన్నారు. వైసిపిలో నేతలు సమన్వయంతో ఉన్నట్లు కనిపిస్తున్నారు.

ఆత్మకూరు నుంచి వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సోదరులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పోటీ పడుతున్నారు. టిడిపి నుంచి మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి చేవూరు శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

చంద్రబాబుపై ఇసికి ఫిర్యాదు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఇఒ ఎంకె మీనాను వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ గ్రీవెన్స్‌సెల్ ఛైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, లీగల్ సెల్ నాయకులు శ్రీనివాసరెడ్డి బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. చంద్రబాబు గత నెల 30న దెందులూరులో జరిగిన బహిరంగ సభలో జగన్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేశారని అన్నారు. అలాగే ఉంగుటూరు, పెద్దాపురం నియోజకవర్గాల్లో జరిగిన బహిరంగ సభల్లోనూ వైసిపి అభ్యర్థులను ధూషించారని వివరించారు.

ఉద్యోగులకు కత్తిమీద సాము

- లెక్కింపు కేంద్రం వద్దకు వెళ్లే వరకు విధులు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా తమకు ఈసారి పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోందని ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. రాష్ట్రంలో దాదాపు 4.10 కోట్ల మంది ఓటర్లున్నారు. 46,165 పోలింగ్ కేంద్రాలున్నాయి. దాదాపు నాలుగు లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. పోలీసు బందోబస్తుకు దాదాపు 2.20 లక్షల మంది సిబ్బంది పాల్గొంటారు. ఈసారి ఎన్నికలు పోటా పోటీగా జరుగుతుండటం, ఉపాధ్యాయులను వద్దని ఒక పార్టీ, సచివాలయ ఉద్యోగులు వద్దని మరో రాజకీయ పార్టీ ఫిర్యాదులతో అలజడి సృష్టించిన నేపథ్యంలో ప్రస్తుతం అన్ని రంగాలకూ చెందిన ఉద్యోగులను ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం చేయడం ఈసారి ప్రత్యేకత. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పోలింగ్ అధికారి (పిఒ), ఒక అసిస్టెంట్ అధికారి (ఎపిఒ), మరో నలుగురు ఒపిఒలు ఉంటారు. ప్రతి కేంద్రంలో ఒక సచివాలయ ఉద్యోగి కూడా ఉంటారు. వీరికి ఇంకుమార్కు బాధ్యత అప్పగిస్తారు. 12వ తేదీ ఉదయం 7 గంటల కల్లా వారికి కేటాయించిన నియోజకవర్గంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల విధులకు హాజరుకావాలి. 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం భోజనం అనంతరం వీరంతా వారికి కేటాయించిన గ్రామాలు, పట్టణాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి. అక్కడే నిద్రించి ఉదయం 7 గంటల కల్లా పోలింగ్ కేంద్రానికి కేటాయించిన ఆరుగురు ఉద్యోగులు పోలింగ్‌కు సన్నద్ధం కావాలి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 6 గంటల తరువాత ఓటర్లు క్యూలైన్లు ఉంటే వారందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే వరకు అవకాశం ఇవ్వాలి. ఏజెన్సీ జిల్లాల్లో మాత్రం సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగుస్తుందని ఎన్నికల కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. ఇవిఎంలు మొరాయించినా, ఓటర్లు 80 శాతంపైన వచ్చినా పోలింగ్ సాయంత్రం 6 గంటల తరువాత కూడా జరిగే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో రాత్రి 10 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ జరిగిన పరిస్థితులున్నాయి.

తక్కువ సిబ్బందితో ఎక్కువ పని

ఓటర్లు పెరిగినా సిబ్బంది పెరగడం లేదు. పోలింగ్ కేంద్రాలు పెరగడం లేదు. సగటున ఒక్కో పోలింగ్ కేంద్రంలో 887 మంది ఓటర్లున్నారని అధికారులు చెబుతున్నా.. ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో గరిష్టంగా 1,500 మంది ఓటర్ల వరకు ఉన్నారు. ఎన్నికల విధులకు ప్రతిసారీ వినియోగించే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల కొరత వల్ల ఈసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను కూడా కొంతమందికి పోలింగ్ విధులు కేటాయించారు. అప్పటికీ సరిపోకపోవడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ అనుమతితో ఎన్నికల అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లను కూడా ఎన్నికల విధులకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉద్యోగులు ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు దాదాపు 12 గంటలకు పైగా ఎటువంటి విశ్రాంతి లేకుండా విధులు నిర్వహించాలి.

పోలింగ్ ఎప్పుడు ముగిస్తే అప్పుడు ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని తీసుకుని ప్రతిఒక్కరూ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్దకు వెళ్లాలి. వీటిని అక్కడ ఉన్న అధికారులకు అప్పగించి రాత్రికి ఇళ్లకు చేరాల్సి వుంటుంది. రెండు రోజులపాటు పూర్తిగా ఎన్నికల విధులకే ఉద్యోగులు పూర్తి స్థాయిలో కేటాయించాలి. ఎవరైనా ఆకస్మికంగా విధులకు హాజరుకాలేకపోతే ప్రత్యామ్నాయంగా 20 శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచుతున్నట్టు అధికారులు తెలిపారు. 12 గంటలపాటు పోలింగ్ కేంద్రాలో ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నా రిలీవర్‌కు అవకాశం లేదు.



కెసిఆర్ ఎన్నికల ప్రచారంపై ఇసి 48 గంటల నిషేధం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఎన్నికల ప్రచారంపై ఎన్నికల కమిషన్ 48 గంటలపాటు నిషేధం విధించింది. ఈ మేరకు ఇసి బుధవారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. సిరిసిల్లలో ఏప్రిల్ ఐదున నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలనుద్దేశించి కెసిఆర్ తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, ఇది ఎన్నికల నియమావళికి పూర్తి విరుద్ధమని కాంగ్రెస్ నేత నిరంజన్‌రెడ్డి ఇసికి ఫిర్యాదు చేశారు. దీనిపై కెసిఆర్ ఇచ్చిన వివరణకు ఇసి సంతృప్తి చెందలేదు.


బుధవారం రాత్రి 8 గంటల నుంచి 48 గంటల పాటు బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఇంటర్వ్యూలు, మీడియా ద్వారా ప్రచారం చేయరాదంటూ ఆయనకు ఇచ్చిన నోటీసులో పేర్కొంది. దీనిపై ఎన్నికల ప్రచారంలో కెసిఆర్ స్పందిస్తూ, కాంగ్రెస్ నేతలు కొన్ని వ్యాఖ్యలను ఎంపిక చేసుకొని తనపై ఇసికి ఫిర్యాదు చేశారని, కాంగ్రెస్ విధానాలు, హామీల అమల్లో వైఫల్యాన్నే తాను ప్రస్తావించానని పేర్కొన్నారు.

పూడిమడక ఫిషింగ్
హార్బర్ కోసం కృషి

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కాదు.. జగన్ గ్రాబింగ్ యాక్ట్
- ఎన్నికల సభల్లో జనసేన అధినేత పవన్

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లిలోని పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కృషి చేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందని, తాము అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి కల్పిస్తామని, లేనిపక్షంలో రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా మండపేట, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, విశాఖ జిల్లా పెందుర్తిల్లో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం తెచ్చింది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కాదని జగన్ గ్రాబింగ్ యాక్ట్ అని విమర్శించారు. పెందుర్తి నియోజకవర్గంలోని తాడి గ్రామాన్ని కాలుష్యం బారి నుంచి రక్షించేందుకు వేరొక చోటుకు తరలిస్తానని చెప్పి ఐదేళ్లు అవుతున్నా తరలించలేదన్నారు. పంచ గ్రామాల సమస్యకు నేటికీ పరిష్కారం చూపలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 30 వేల మంది యువతులు రాష్ట్రంలో అదృశ్యమైనా అధికార పార్టీకి చెందిన ఏ ఒక్క ఎమ్మెల్యే నోరుమెదపలేదన్నారు. రాష్ట్రంలో 23 లక్షల మంది యువత గంజాయి బారినపడి చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖను భూకబ్జాలమయంగా జగన్ మార్చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సెజ్‌ల్లో పరిశ్రమల స్థాపనకు భూములిచ్చిన నిర్వాసితుల పక్షాన తాను పోరాడుతానని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, విద్యా దీవెన అందలేదన్నారు. 27 దళిత పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. తోట త్రిమూర్తులు జనసేన పార్టీలోకి రావడం లేదని, అటువంటి సంకేతాలు తనకు అందలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి పని చేస్తానని తెలిపారు. అందరి ఉమ్మడి లక్ష్యం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడమేనన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు మరింత అప్పులో కూరుకుపోయారని తెలిపారు. వ్యవసాయంలో రైతులకు ఇచ్చే రాయితీలు వైసిపి సర్కారు తొలగించిందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఆయా సభల్లో అనకాపల్లి బిజెపి ఎంపి అభ్యర్థి సిఎం రమేష్, జనసేన యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, టిడిపి అమలాపురం ఎంపి అభ్యర్థి గంటి హరీష్ మాథూర్ పాల్గొన్నారు.


పెందుర్తి సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

డబ్బున్నోడే పోటీదారు


- ఎంపి, ఎంఎల్‌ఎ అభ్యర్థుల్లో 32 మంది శతకోటీశ్వర్లు
- అంతకంతకూ పెరుగుతున్న సంఖ్య
- చట్టసభల్లో సామాన్యుడి స్థానమెక్కడ?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానానికి పోటీ పడుతున్న టిడిపి అభ్యర్థి, ఎన్‌ఆర్‌ఐ పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్నికల కమిషన్‌కు అధికారికంగా అఫిడవిట్ రూపంలో చూపించిన తమ కుటుంబం ఆస్తి రూ.5,785 కోట్లు. అసెంబ్లీ బరిలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించిన ఆస్తి రూ.810 కోట్లు. లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల్లో వీరిదే అత్యధిక ఆస్తి. ముఖ్యమంత్రి జగన్ చూపించిన ఆస్తి రూ.757 కోట్లు. అసెంబ్లీ అభ్యర్థుల్లో చంద్రబాబు త్వాతి స్థానం జగన్‌ది. అసెంబ్లీ అభ్యర్థుల్లో వంద కోట్లకు పైబడి ఆస్తి కలిగిన వారు 23 మంది ఉన్నారు. ఎంపి క్యాండేట్లలో వంద కోట్ల కంటే ఎక్కువ ఆస్తి కలిగిన వారు తొమ్మిది మంది. ఈ లెక్కలు ఇసి అధికారిక అఫిడవిట్లలో పేర్కొన్నవి. వాస్తవంలో ఎవరెవరికి ఎన్నెన్ని ఆస్తులున్నాయో ఊహించలేం. ఈ వివరాలు ప్రజాస్వామ్యం కాదు ధనస్వామ్యమని అర్థమవుతుంది.

డబ్బున్నోడిదే రాజకీయం. డబ్బు లేకపోతే గెలవడం కాదుకదా కనీసం పోటీచేసి ప్రచారం కూడా చేసుకోలేని పరిస్థితిని పాలకవర్గాలు కల్పించాయి. చట్టసభల్లోకి వెళ్లాలంటే డబ్బే కొలమానం. రాష్ట్రంలో గతంలో కూడా కోటీశ్వర్లు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితులు అక్కడక్కడ ఉండేది. ఇప్పుడది అన్ని నియోజకవర్గాలకు పాకిపోవడం ఆందోళన కలిగించే విషయం. ఓటును కొనుగోలు చేసి చట్టసభల్లోకి వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తాము పెట్టిన పెట్టుబడి ఇస్తానంటే నిస్సిగ్గుగా డబ్బులు ఇచ్చేపార్టీలోకి జంప్ అయిపోతున్నారు. అడ్డగోలుగా ఫిరాయింపులకు మూలం డబ్బే. అధికారపార్టీలు ప్రజాప్రయోజనాలను పక్కనబెట్టి ఏ కార్పోరేట్ సంస్థ ముడుపులు ఇస్తే ఆ సంస్థకు అనుకూలమైన నిర్ణయాలు చేసేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక వద్దే రాజకీయపార్టీలు డబ్బును చూస్తున్నారు. పార్టీ టికెట్ ఇవ్వాలంటే అసెంబ్లీకి అయితే రూ 25 కోట్లనుండి రూ 30 కోట్లు, పార్లమెంట్‌కు అయితే రూ 70 నుండి వంద కోట్లు. అటువంటి వారికే ప్రధాన పార్టీలు టికెట్లిచ్చాయి. అందుకే ఈ సారి ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని శతకోటీశ్వర్లు బరిలోకి వచ్చారు.

గుంటూరు లోక్‌సభలో టిడిపి అభ్యర్థి పెమ్మసాని దేశంలోనే అత్యంతధనవంతుడైన అభ్యర్థిగా తేలారు. ఆయన ఆస్తుల విలువ అఫిడవిట్ ప్రకారం రూ 5,785 కోట్లు. వైసిపి అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య ఆస్తి రూ 70.50 కోట్లు. ఇక్కడే ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ ఆస్తులు కేవలం రూ 61లక్షలు మాత్రమే. అలాగే విజయవాడ సెంట్రల్‌తో టిడిపి అభ్యర్థి బోండా ఉమా ఆస్తులు రూ 93.5 కోట్లుకాగా, వైసిపి అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ ఆస్తులు రూ 22.66 కోట్లు కాగా సిపిఎం నుండి బరిలో వున్న చిగురుపాటి బాబురావు ఆస్తులు రూ 73 లక్షలు. ఇవి ఉదాహరణలు మాత్రమే. రాష్ట్రంలో లోక్‌సభ బరిలో 11 మంది శతకోటీశ్వర్లతో పాటు మరో 10 మంది కోటీశ్వర్లు రంగంలో వున్నారు. అసెంబ్లీకి వచ్చే సరికి 23 మంది శతకోటీశ్వర్లు, మరో తొమ్మిది మంది కోటీశ్వర్లు వున్నారు. సాధారణ ప్రజల తరుపున మాట్లాడే కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్యవాదుల స్థానంలో శతకోటీశ్వర్లు చట్టసభల్లోకి వెళ్తున్నందునే కార్పోరేట్‌లకు అనుకూలమైన, ప్రజావ్యతిరేకమైన శాసనాలు, విధానాలు అలవోకగా వస్తున్నాయి.


చంద్రబాబునాయుడు


జగన్‌మోహన్‌రెడ్డి


సిఎం రమేష్


ఎం శ్రీభరత్


లోకం మాధవి


పెమ్మసాని చంద్రశేఖర్


పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి


నారా లోకేష్


ఎంవివి సత్యనారాయణ



రాష్ట్రంలో చట్టసభలకు పోటీ చేసిన శతకోటీశ్వర్ల వివరాలు

పార్లమెంట్ స్థానాలకు

1 పెమ్మసాని చంద్రశేఖర్(టిడిపి) గుంటూరు	రూ 5,785 కోట్లు
2 వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (టిడిపి) నెల్లూరు	రూ 716.31 కోట్లు
3 సిఎం రమేష్ (బిజెపి) అనకాపల్లి	రూ 497.59 కోట్లు
4 ఎం శ్రీభరత్ (టిడిపి) విశాఖపట్నం	రూ 393.41 కోట్లు
5 పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (వైసిపి) రాజంపేట	రూ 209.53 కోట్లు
6 పోచా బ్రహ్మానందరెడ్డి(వైసిపి) నంద్యాల	రూ 147.74 కోట్లు
7 సింహాద్రి చంద్రశేఖర్ (వైసిపి) మచిలీపట్నం	రూ 138.41 కోట్లు
8 వి బాలశౌరి(జనసేన) మచిలీపట్నం	రూ 133.71 కోట్లు
9 వైఎస్ షర్మిల(కాంగ్రెస్) కడప	రూ 132 కోట్లు

అసెంబ్లీ స్థానాలకు

1 నారా చంద్రబాబునాయుడు (టిడిపి) కుప్పం	రూ 810 కోట్లు
2 వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (వైసిపి) పులివెందుల	రూ 757.65 కోట్లు
3 లోకం మాధవి (జనసేన) నెల్లిమర్ల	రూ 894.92 కోట్లు
4 పి నారాయణ (టిడిపి) నెల్లూరు సిటి	రూ 824.05 కోట్లు
5 వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి(టిడిపి) కోవూరు	రూ 715.62 కోట్లు
6 నారా లోకేష్ (టిడిపి) మంగళగిరి	రూ 542.17 కోట్లు
7 ఎంవివి సత్యనారాయణ(వైసిపి) విశాఖ తూర్పు	రూ 421.30 కోట్లు
8 మాదవి రెడ్డి (టిడిపి) కడప	రూ 325.61 కోట్లు
9 టిజి భరత్ (టిడిపి) కర్నూలు	రూ 243.57 కోట్లు
10 రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ (వైసిపి) కావలి	రూ 236.98 కోట్లు
11 రఘురామకృష్ణంరాజు(టిడిపి) ఉండ	రూ 219.4 కోట్లు
12 బొల్ల బ్రహ్మనాయుడు(వైసిపి)	రూ 219 కోట్లు
13 మేకపాటి విక్రమ్‌రెడ్డి (వైసిపి) ఆత్మకూరు	రూ 209.22 కోట్లు
14 వసంత కృష్ణప్రసాద్ (టిడిపి) మైలవరం	రూ 188 కోట్లు
15 నందమూరి బాలకృష్ణ (టిడిపి) హిందూపురం	రూ 184.83 కోట్లు
16 బిసి జనార్ధన్‌రెడ్డి (టిడిపి) బనగానపల్లె	రూ 173.29 కోట్లు
17 పవన్‌కల్యాణ్ (జనసేన) పీఠాపురం	రూ 164.54 కోట్లు
18 డి వెంకటకృష్ణారెడ్డి (టిడిపి) కావలి	రూ 153.27 కోట్లు
19 విడదల రజని(వైసిపి) గుంటూరు పశ్చిమ	రూ 129.62కోట్లు
20 థామస్ (టిడిపి) గంగాధరనెల్లూరు	రూ 124 కోట్లు
21 పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(వైసిపి) పుంగనూరు	రూ 114.27 కోట్లు
22 బి నరేంద్ర వర్మ (టిడిపి) బాపట్ల	రూ 109.47 కోట్లు
23 విష్ణుకుమార్‌రాజు(బిజెపి) విశాఖ ఉత్తరం	రూ 106.22 కోట్లు

సంపాదకీయం


దొందూ దొందే!

ప్రాంతీయ పార్టీలు తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడటం సాధారణంగా చూస్తాం. మన రాష్ట్రంలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆత్మగౌరవ నినాదంతో పురుడుపోసుకున్న తెలుగుదేశం పార్టీతో పాటు, అధికార వైసిపి కూడా రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఈ రెండు పార్టీలు విడుదల చేసిన మ్యానిఫెస్టోలే దీనికి నిదర్శనం. ఎన్నికల ప్రచారంలో పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటూ, వ్యక్తిగత దూషణలకు కూడా వెనకాడని ఈ పార్టీలు కేంద్రంతో పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవడంలో మాత్రం దొందూ దొందేగా వ్యవహరిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా విడుదల చేసిన వైసిపి మ్యానిఫెస్టోలో ఏ అంశాలనైతే విస్మరించారో, అవే అంశాలు బిజెపి, టిడిపి, జనసేన కూటమి నాయకులు మంగళవారం విడుదల చేసిన కూటమి మ్యానిఫెస్టోలోనూ కనిపించకపోవడం కేవలం యాదృచ్ఛికం కాదు. ఉద్దేశ్యపూర్వకంగా రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే! భావి తరాలకు తీరని అన్యాయం చేయడమే! ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడం రాష్ట్రాభివృద్ధికి ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటిలో ఒక్కదానిని కూడా ప్రస్తావించకుండా అధికారపక్షంతో పాటు, ప్రధాన ప్రతిపక్షం ఎన్‌డిఎ కూటమి కూడా మ్యానిఫెస్టోను విడుదల చేసిందంటే అర్థం ఏమిటి? రాష్ట్రాన్ని బిజెపికి తాకట్టు పెట్టినట్టు కాదా? కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు ఎందుకీ దిగజారుడు? ఏ ప్రయోజనాల కోసం? రాష్ట్ర ప్రజలను ఇంతగా మోసం చేస్తారా?

అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును గుర్తించకుండా ప్రజలను భ్రమల్లో ముంచెత్తడానికే టిడిపి, వైసిపిలు పోటీ పడి సంక్షేమ పథకాలను ప్రకటించినట్టు కనిపిస్తోంది. పథకాల ప్రకటనలో ఎవరు గొప్ప అంటూ జరిగే రచ్చలో అసలు విషయాన్ని పక్కకు నెట్టేసి పబ్బం గడుపుకోవాలన్నది వారి వ్యూహమంటూ వ్యక్తమవుతున్న అభిప్రాయాలనూ తిరస్కరించలేము. కానీ, ఈ పార్టీలు నిరుద్యోగాన్ని రూపుమాపడం, అధిక ధరలకు కళ్లెం వేయడం వంటి నిత్యజీవిత సమస్యలపై కూడా మౌనాన్నే పాటిస్తుండటం గమనార్హం. ఏళ్ల తరబడి ఊరిస్తూనే ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి సమస్యలపై కూడా ఆ పార్టీలది ఇదే వైఖరి! వంచనా శిల్పకళను దట్టించి రూపొందించిన కూటమి మ్యానిఫెస్టోపై మోడీ బొమ్మ లేకపోవడం, కార్యక్రమానికి హాజరైన బిజెపి ప్రతినిధి మ్యానిఫెస్టో ప్రతులను కనీసం చేతితో తాకడానికైనా సిద్ధపడకపోవడం మూడు పార్టీల మధ్య నెలకొన్న పరస్పర విశ్వాస రాహిత్యానికి నిదర్శనం! ఈ కార్యక్రమం తరువాతే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి వస్తే 33 వేల కోట్ల రూపాయల పోలవరం సెస్‌ను రాష్ట్ర ప్రజలపై మోపుతామంటూ చేసిన ప్రకటన బిజెపి ముందు మరింత సాగిలపడటానికి నిదర్శనం. విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాజెక్టుగా పోలవరం పునరావాస, పునర్నిర్మాణ ఖర్చును కేంద్రం భరించాల్సిందే. రాష్ట్ర హక్కుగా వచ్చిన దాన్ని సాధించడం మాని అంత తీవ్రమైన భారం ప్రజలపై మోపడమేమిటి? సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితుల్ని బిచ్చగాళ్లుగా మార్చడం దారుణం. దీనిపై టిడిపి, వైసిపిలు తమ వైఖరులను వెల్లడించాల్సి ఉంది. ఇదొక్కటే కాదు. మతోన్మాద ఎజెండాలో భాగంగా బిజెపి ముందుకు తీసుకువచ్చిన సిఎఎ పైనా ఆ పార్టీలు ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. రాజ్యాంగాన్ని మార్పు గురించి, ఎస్‌సి, ఎస్టీ రిజర్వేషన్లు, ముస్లిం రిజర్వేషన్ల గురించి కూడా టిడిపి-జనసేనలతో పాటు వైసిపి కూడా తమ వైఖరిని ప్రకటించాలి.

టిడిపి-జనసేనలతో పాటు వైసిపి కూడా ఎంతగా విస్మరించడానికి ప్రయత్నించినప్పటికీ ఎన్నికల సమరాంగణంలో విభజన హామీలు, ప్రత్యేక హోదా నినాదాలు వినపడుతూనే ఉన్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు ఉద్యమిస్తూనే ఉన్నారు. చట్ట ప్రకారం తమకు హక్కయిన పునరావాసం కోసం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పోరాడుతూనే ఉన్నారు. ఈ నినాదాలు ఇంకా మారుమ్రోగుతుండటానికి, పోరాటాలు కొనసాగుతుండటానికి ప్రజల్లో ఉన్న బలమైన ఆకాంక్షలు, వామపక్షాలు ఇస్తున్న అండదండలే కారణం. మ్యానిఫెస్టోల మాయాజాలంతో ఈ ఆకాంక్షల గొంతు నులమడానికి చేస్తున్న ప్రయత్నాలు విఫలం కాక తప్పదు.

మహనీయుల మాట




అన్యాయ పరిస్థితుల్లో మీరు తటస్థంగా వుంటే, మీరు అణచివేతదారుల వైపు వుండడానికి నిర్ణయించుకున్నారని అర్థం.

- డెస్మండ్ టుటు,
వర్ణవివక్ష ఉద్యమకారుడు.



మోడీ గ్యారెంటీలు ప్రచార ఆర్భాటమే

విశ్లేషణ




సారంపల్లి మల్లారెడ్డి

పద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికలు 2024 ఏప్రిల్ 19 నుండి జూన్ 2 వరకు 7 విడతలుగా జరుగుతున్నాయి. తిరిగి మూడవసారి అధికారం చేపట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బిజెపి కూటమి 'మోడీ గ్యారంటీల' పేరుతో విస్తృత ప్రచారం చేస్తున్నది. ప్రధాన ప్రచార, ప్రసార సాధనాలను వినియోగించడమేకాక, వారి సొంత సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారం వెగటు పుట్టిస్తున్నది. గత పది సంవత్సరాలలో జరగని కృషిని జరిగినట్లు చెప్పడంతోపాటు 2047 నాటికి 'వికసిత భారత్' ఏర్పాటు చేస్తామని చెబుతున్నది. ప్రస్తుతం దేశం 'ఆత్మనిర్భర్ భారత్' (స్వయం పోషకత్వ దేశం)గా మారిందని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. 144 కోట్ల జనాభాలో నేటికీ దారిద్ర్య రేఖకు దిగువన 30 శాతం మంది ప్రజలు వున్నట్లు ఆర్‌బిఐ మాజీ అధ్యక్షులు రంగరాజన్ నేతృత్వంలోని కమిషన్ చెబుతుండగా, మోడీ ప్రభుత్వం తమ 10 సంవత్సరాల పాలనలో 25 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుండి ఎగువకు తెచ్చామని చెప్పింది. అదే సందర్భంలో 81 కోట్ల మందికి రానున్న 5 సంవత్సరాలలో నెలకు 5 కిలోల చొప్పున ఉచిత ఆహార పంపిణీ చేస్తామని వాగ్దానం చేసింది. ఈ పథకం ద్వారా పరోక్షంగా దారిద్ర్యం ఉన్నట్లు అంగీకరించడమే. బిజెపి పాలనలో 1 శాతం కార్పొరేట్లకు 40 శాతం దేశ సంపద పోగు బడినట్లు, 50 శాతం అట్టడుగు జనాభా చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉందని 'ఆక్స్‌ఫామ్' నివేదిక వెల్లడించింది. 2020 నాటికి దేశంలో శత కోటీశ్వరులు 102 నుండి 1695కు పెరిగారు. దేశ ఆర్థిక సంపద కార్పొరేట్ల చేతులలో బంధీ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన ఉదాహరణ అవసరం లేదు. మోడీ గ్యారెంటీల పేరుతో జరిగిన అభివృద్ధి ఈ విధంగా (పట్టిక) వుంది.

అంశం	2014	2024
పెట్రోల్ లీటర్	రూ.71	రూ.102
క్రూడాయిల్ బ్యారల్	డాలర్లు 113	83
వంట గ్యాస్	రూ.410	రూ.1160 (855)
దేశ రుణాలు (లక్షల కోట్లు)	రూ.55.85	రూ.155.31
డాలర్‌తో రూపాయి విలువ	రూ.62	రూ.86

పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం ఆట కట్టిస్తామన్నారు మోడీ. 1000, 2000 నోట్ల రద్దు వలన 99 శాతం నోట్లు బ్యాంకులకు వచ్చినప్పటికి 'బ్లాక్ మనీ' మాత్రం రాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కానీ గత ప్రభుత్వ ఉద్యోగాలలో 50 శాతం కోత పెట్టారు. దేశ ఉద్యోగిత పెంచుతామన్నారు. కానీ ప్రపంచంలోకెల్లా అతి తక్కువ ఉద్యోగిత మన దేశంలోనే వున్నది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వలన ఆకలి సూచీలో మన దేశం 111వ స్థానానికి చేరింది. మహిళల రక్షణకు పెద్ద పీట వేస్తామన్నారు. కానీ మణిపూర్ మహిళలపై అత్యాచారాలు, హత్యలు, మహిళా రెజ్లర్లపై బిజెపి ఎం.పి బ్రిజ్‌భూషణ్ లైంగిక దాడులు...మచ్చుకు కొన్ని మాత్రమే. అవినీతిని అంతం చేస్తామని బీరాలు పలికారు. రూ.16 వేల కోట్ల ఎన్నికల బాండ్లలో బిజెపికి రూ.8250 కోట్లు వచ్చాయి. బాండ్లు ఇచ్చిన వారికి వాణిజ్య లైసెన్స్‌లు, కాంట్రాక్ట్‌లు అందించడంలో 'క్విడ్ ప్రో కో'గా సహకరించారు. ఇ.డి పెట్టిన కేసులలో 0.42 శాతం మాత్రమే పరిష్కారం అయ్యాయి. పైగా ఇ.డి ని 140 రకాల నేరాలకు విస్తరించారు. 2014-2022 మధ్య అరెస్టయిన 121 మంది రాజకీయ నాయకులలో 115 మంది ప్రతిపక్ష నేతలే కావడం గమనార్హం. ఎన్నికలలో ధన ప్రవాహాన్ని కట్టడి చేస్తామన్నారు. 2024 ఏప్రిల్ 17 నాటికి దేశంలో రూ.4,600 కోట్లు పట్టుకున్నారు. అంటే సగటున రోజుకు రూ.100 కోట్లు చొప్పున పట్టుకున్నారు. పట్టుబడని డబ్బు ఇంతకు నాలుగు రెట్లు ఓటర్లకు చేరవేయడానికి పాలక వర్గాలు ప్రయత్నిస్తున్నాయి.



అభివృద్ధి ఏదీ!

డబుల్ ఇంజన్ సర్కార్ పేర బిజెపి పాలిత రాష్ట్రాలలో అభివృద్ధి బాగా జరిగినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. దారిద్ర్యం, నిరుద్యోగం పెరగడమేకాక శాంతిభద్రతల సమస్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో భాగంగా 'వాషింగ్ మెషీన్' విధానాన్ని అమలు జరుపుతున్నది. అంటే వేల కోట్ల రూపాయలు మింగేసిన అవినీతిపరులు తమ పార్టీలోకి వచ్చాక వారి అవినీతి ఆరోపణలను తొలగించి వేస్తున్నారు. అశోక్ చౌహాన్ (కార్గిల్ ఇళ్ల కుంభకోణం), అజిత్ పవార్ (రూ.25 వేల కోట్లు), నవీన్ జిందాల్ (ఎన్నికల బాండ్లు), గాలి జనార్ధన్‌రెడ్డి (వేల కోట్ల ఐరన్ ఓర్), తపస్ రాయ్, సువేందు రాయ్ లాంటి 60 మందికి వాషింగ్ మెషీన్ పథకం కింద అవినీతి నేరాలను తొలగించారు. ఇప్పటికీ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తోపాటు అనేకమంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా జైలులో పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి మధు కొడాను అక్రమ గనుల కేసులో అరెస్టు చేసి అతని భార్యను బిజెపిలో చేర్చుకుని కేసు ఉప సంహరింపజేశారు.

దేశాన్ని 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగాను, ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగాను తయారు చేస్తామని ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వ బిజెపి నిరంతరం ప్రచారం చేస్తున్నది. ప్రపంచంలో ఒకటవ స్థానంలో అమెరికా (26 ట్రిలియన్ డాలర్ల జిడిపి), రెండవ స్థానంలో చైనా (17.57 ట్రిలియన్ డాలర్ల జిడిపి), 4.23 ట్రిలియన్ డాలర్లతో జర్మనీ, 4.21 ట్రి.డాలర్లతో జపాన్ దేశాలు ఉన్నాయి. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ 3.7 ట్రిలియన్ డాలర్లతో ఐదవ స్థానంలో ఉంది. 3, 4 స్థానాలను అధిగమించలేని దేశ ఆర్థిక పరిస్థితి మనది. అయినా మోడీ ప్రభుత్వం కుహనా ఆర్థికవేత్తల ద్వారా మూడవ స్థానానికి ఎదగగలమని ప్రచారం చేస్తున్నది.

రాజ్యాంగ హననం

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాజేసి, ప్రాథమిక హక్కులను హరించి వేస్తున్నారు. 370 ఆర్టికల్ సవరణతో జమ్ము కాశ్మీర్ శాసన సభను రద్దు చేసి రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విడగొట్టారు. రాష్ట్రాల పన్ను ఆదాయాన్ని తగ్గించడానికి, ముఖ్యంగా బిజెపి యేతర రాష్ట్రాల ఆదాయాన్ని దెబ్బ కొట్టడానికి ఒకే పన్ను విధానం 'జిఎస్‌టి' తెచ్చింది. బ్యాంకులకు రూ. వేల కోట్లు ఎగనామం పెట్టిన కార్పొరేట్లకు తిరిగి రుణాలు ఇవ్వడానికి బ్యాంకుల సవరణ చట్టం ద్వారా 27 బ్యాంకులను 12 గ్రూపులుగా మార్చారు. అక్రమ లావాదేవీలతో అధిక ఆదాయాన్ని ప్రకటించిన అదానీ సంస్థలపై అమెరికన్ సంస్థ హిండెన్ బర్గ్ చేసిన పరిశోధనలను పార్లమెంట్‌లో చర్చించడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని రాజ్యాంగ విరుద్ధంగా కొనసాగిస్తున్నది. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే టారిఫ్, ఒకే ఛానల్ పేరుతో విద్యా విధానాన్ని, విద్యుత్‌ఛక్తిని, మీడియాను కేంద్రం అధీనంలోకి తీసుకున్నది. త్రిశూలం పేర ఇ.డి, ఐ.టి, సిబిఐ సంస్థలతో ప్రతిపక్షాలపై దాడులు సాగిస్తున్నది. ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది. అక్రమంగా ఉపా చట్టం కింద మేధావులను అరెస్టు చేశారు. అంతేగాక వారికి వ్యతిరేకంగా రాసిన 60 మంది జర్నలిస్టులు హత్యలకు గురయ్యారు. న్యూస్ క్లిక్ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థను జైలులో పెట్టారు. రాష్ట్రాల హక్కులను కాజేసే విధంగా రాజ్యాంగ చట్ట సవరణలు చేశారు. పౌరసత్వ సవరణ చట్టంతో ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుండి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వ హక్కు అమలుకు పూనుకుంటున్నారు. ముస్లింలకు వున్న రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్నారు. ముస్లిం పర్సనల్ లా ను రద్దు చేస్తామంటున్నారు. పార్లమెంట్‌ను రాజ్యాంగబద్ధంగా నిర్వహించకుండా బిల్లులన్నిటినీ మూజువాణి ఓటుతో అంగీకరింపచేస్తున్నారు. పార్లమెంట్ సమావేశ కాలాన్ని సగానికి కుదించారు. బిజెపి మూడవ సారి అధికారానికి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, అధ్యక్ష తరహా పాలన తేవడం జరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్నది. గవర్నర్ల వ్యవస్థ ద్వారా బిజెపి యేతర రాష్ట్రాల శాసనసభలలో ఆమోదించిన బిల్లులను అంగీకరించకుండా పెండింగులో పెట్టారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ గవర్నర్ల వ్యవస్థలో ఎలాంటి మార్పు రాలేదు. ఎన్నికల కమిషన్ ఏర్పాటుకు ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు జడ్జితో త్రిసభ్య కమిటీని సూచించాల్సి వుంది. కానీ సుప్రీంకోర్టు జడ్జిని తొలగించి కేంద్ర క్యాబినెట్ మంత్రితో త్రిసభ్య కమిటీ వేసి ప్రస్తుత ఎన్నికల కమిషన్‌ను రికమండ్ చేసి భారత అధ్యక్షునిచే ఆమోదింపజేసుకున్నారు.

5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

దేశాన్ని 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగాను, ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగాను తయారు చేస్తామని ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వ బిజెపి నిరంతరం ప్రచారం చేస్తున్నది. ప్రపంచంలో 1వ స్థానంలో అమెరికా (26 ట్రిలియన్ డాలర్ల జిడిపి), 2వ స్థానంలో చైనా (17.57 ట్రిలియన్ డాలర్ల జిడిపి), 4.23 ట్రిలియన్ డాలర్లతో జర్మనీ, 4.21 ట్రి.డాలర్లతో జపాన్ దేశాలు ఉన్నాయి. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ 3.7 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానంలో ఉంది. 3, 4 స్థానాలను అధిగమించలేని దేశ ఆర్థిక పరిస్థితి మనది. అయినా మోడీ ప్రభుత్వం కుహనా ఆర్థికవేత్తల ద్వారా 3వ స్థానానికి ఎదగగలమని ప్రచారం చేస్తున్నది. తలసరి ఆదాయంలో ప్రపంచంలో 120 స్థానంలో వున్నాం. కానీ జనాభాలో మొదటి స్థానంలో వున్నాం. ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి అంగీకరించని బిజెపి ప్రభుత్వం మతోన్మాద చర్యలను రెచ్చగొట్టి ప్రజలలో విభజనలు తెస్తున్నది. రామాలయంలో రాముడి విగ్రహ ప్రతిష్టకే రూ. వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. మతాల మధ్య ఘర్షణ సృష్టించి మూడవ సారి గెలవడానికి ఎన్నికల గ్యారంటీలను ప్రచారం చేస్తున్నది బిజెపి. 10 సంవత్సరాల అనుభవం తరువాత 'మోడీ గ్యారంటీలు' అభూత కల్పనలేనన్న అభిప్రాయానికి వచ్చిన ఓటర్లు ... ప్రస్తుత బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తారని గమనించాలి.

/వ్యాసకర్త సెల్ : 9490098666/

పాట



నీ ఓటెవరికి ...?

సాకీ:
ఓటే ఓ ఆయుధం నమ్ముకుంటే
ఏం లాభం లేదు దాన్ని అమ్ముకుంటే
అందుకే చేతులు కలిపి ఒకటౌదాం
ఒక్కో ఓటు చేర్చుకునీ
ప్రజా బలం చూపుదాం
ప్రజా రాజ్యం కాంచుదాం
పల్లవి:
ఓటరూ చెప్పవా
ఓటెవరికి నీ ఓటెవరికి
ఓ ఓటరూ చెప్పవా
ఓటెవరికి నీ ఓటెవరికి
ఇకనైనా విప్పవా చిక్కుముడి
ఓటెవరికె నీ ఓటెవరికి
ఓటెవరికె నీ ఓటెవరికి //ఓ//
చరణం 1:
తీపి తీపి మాటలే
చెప్పువారొక వైపు
చెప్పువారొక వైపు
ఘాటు ఘాటు మాటలతో
యుద్ధం ఒక వైపు
యుద్ధం ఒక వైపు
గందరగోళమైన ఈ మాటల యుద్ధాలను
దాటితే చాలనే నిర్ణయానికొచ్చావా
నిశ్చలంగ వున్నావా //ఓ//
చరణం 2:
మతం మహమ్మారినే
నమ్ముకున్న కొందరు
నమ్ముకున్న కొందరు
జనులందరి మధ్య
విషపు గీతలే గీసి
విషపు గీతలే గీసి
తమ పబ్బం గడుపుకొనగ గంతులే వేస్తుంటే
జాలిగా చూసేసి మౌనంగా వున్నావా
మాటలే వద్దని మౌనంగా వున్నావా //ఓ//
చరణం 3:
డబ్బు రాజ్యమేలుతుంది
రంగులే మార్చుతుంది
రంగులే మార్చుతుంది
తాత్కాలిక అవసరాలు
తీర్చకనే తీరుస్తుంది
తీర్చకనే తీరుస్తుంది
పదవులొచ్చి కుర్చీలో
కూర్చున్న మరుక్షణం
మనసు మారిపోతుంది
మనుషులనే మార్చుతుంది //ఓ//
చరణం 4:
సామ్యవాద శాస్త్రీయపు
ఆలోచనలున్న వారి
ఆలోచనలున్న వారి
మాటలకు చేతలకు
కట్టుబడీ వున్నోళ్ళకు
కట్టుబడీ వున్నోళ్ళకు
డబ్బులూ మందును
ముట్టకుండ నిలబడి
ఒక్కసారి గెలిపిద్దాం
తేడాను గమనిద్దాం
ఒక్కసారి గెలిపిద్దాం
తేడాను గమనిద్దాం //ఓ//
చరణం 5:
ప్రజల పక్షాన వారు
నిలబడి పోరుతారు
నిలబడి పోరుతారు
నికరంగా వుంటారు
నిఖార్సుగా వుంటారు
మాట తప్పరు వారు
మడమ తిప్పరు వారు
మడమ తిప్పరు వారు
ముక్కు సూటిగా పోయి
ముందే నిలబడతారు
ముత్యాల్లా మెరుస్తారు
రత్నాల్లా వెలుగుతారు. //ఓ//

- జంధ్యాల రఘుబాబు

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

నివాళి

ఆదర్శ కమ్యూనిస్టు



సిపిఎం సీనియర్ నాయకులు, శతాధిక వయస్కులు కామ్రేడ్ ధూళిపాళ్ల సుబ్బారావు ఆఖరి వరకూ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం, అనంతవరం గ్రామస్తుడైన ఆయన 1946 నుండి పార్టీ సభ్యులుగా ఉన్నారు. 1971 నుండి 81 వరకు అనంతవరం పార్టీ శాఖా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. రైతు సంఘం తెనాలి డివిజన్ ఉపాధ్యక్షుడిగా చేశారు. కామ్రేడ్ డి.సుబ్బారావు పెద్దగా చదువుకోలేదు. అయినప్పటికీ పార్టీ సాహిత్యం చదివేవారు. సీనియర్ నాయకులుగా ఉన్న కామ్రేడ్లు భైరవానందం, బాపయ్యలు ఊరు నుండి వెళ్ళిన తదనంతరం ఆయన నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. గ్రామంలో రైతు కుటుంబాల నుండి అందరూ పార్టీ నుంచి వెళ్లినా ఆయన అచంచల విశ్వాసంతో పార్టీ కోసం కృషి చేశారు. సుందరయ్య, ఎల్‌బిజి, కొరటాల వంటి నేతలకు ఆయన సన్నిహితుడు. సుందరయ్య నాయకత్వంలో 3 నెలలు జయప్రదంగా నిర్వహించిన సర్వేలో ఆయన సంపూర్ణ భాగస్వామి. 1978లో గ్రామంలో జరిగిన కూలీల సమ్మెలో దొప్పలపూడి నాగేశ్వరరావుతో కలిసి నిలబడ్డారు. కార్యకర్తలకు అండగా నిలిచారు. కూలీల తరపున నిలబడి సమ్మెను బలపరిచారు. లంక భూముల వేలంపాటలను ధిక్కరించారు. యువ బృందంతో కలిసి బందరు కాల్వ పూడిక తీతలో పాల్గొన్నారు. తెలంగాణ పోరాట సమయంలో కొరియర్‌గా బండి కట్టి నాయకులను దాటించారు. అప్పుడు పలుసార్లు పోలీసులను ఎదుర్కొన్నారు. పనిలో దీక్షగా వుండే ఆయన...ప్రజా సమీకరణకు తనకున్న పరిమిత వనరులలో ఆర్థిక సదుపాయాలు చేసేవారు. ప్రతి సంవత్సరం జనవరిలో కార్యకర్తలకు బట్టలు ఇచ్చేవారు. తెనాలి, కొల్లూరు, గుంటూరులో పార్టీ ఆఫీస్ నిర్మాణానికి శక్తికి మించి సహాయం చేశారు. చివరలో ఇంక ఏమీ ఇవ్వలేనన్న స్థితిలో కూడా లక్ష రూపాయలు అందించారు. జ్యోతిబసు స్ఫూర్తితో శరీరదానం చేశారు. కుటుంబ సభ్యులకు కూడా పార్టీ పట్ల అదే ఆదరణ. వయో భారంతో ఇటీవల మరణించిన కామ్రేడ్ డి.సుబ్బారావు సౌమ్యుడు, మానవత్వం మూర్తీభవించిన ఆదర్శ కమ్యూనిస్టు.

- డి. రమాదేవి,
సిపిఎం ఎ.పి కార్యదర్శివర్గ సభ్యులు.

సమస్య

నైజీరియాలో ఆహారం కోసం అల్లర్లు

ఆర్య జినదేవన్



ఐ.ఎం.ఎఫ్ సలహా మేరకు 2023 మే మాసంలో టినుబు ప్రభుత్వం ఇంధన సబ్సిడీని పూర్తిగా తొలగించి వేసింది. దీంతో దేశీయ ఆహార పదార్థాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడింది. ఆ తరువాత, నైజీరియన్ కరెన్సీ 'నైరా' విలువ 2023 జూన్‌లో సరళీకృతం చేయబడింది. ఫలితంగా 'నైరా' మారకం విలువ పతనమైంది. దీంతో దిగుమతులపై ఎక్కువ డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. టినుబు ప్రభుత్వం దిగుమతులను తగ్గించడమే పరిష్కారంగా భావించింది. అదే దేశాన్ని తీవ్ర ఆహార కొరతలోకి, ఆపై అల్లర్లలోకి నెట్టింది.

నైజీరియా! ఆఫ్రికాలో అత్యధిక జనాభా కలిగిన దేశం. పశ్చిమ ఆఫ్రికా తీరంలో చమురు సంపన్న దేశం. అలాంటిది తీవ్ర ఆహార కొరత కారణంగా అశాంతితో అల్లాడిపోతోంది. దేశ వాణిజ్య రాజధాని లాగోస్, రాజకీయ రాజధాని అబుజాతో సహా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దేశవ్యాప్తంగా ఆహారం కోసం ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. గోడౌన్లు, హోల్‌సేల్ సెంటర్లు, సూపర్ మార్కెట్లే కాకుండా ఆహార ధాన్యాలను తరలించే ట్రక్కులను కూడా లూటీ చేస్తున్నారు. మరోవైపు ప్రెసిడెంట్ బోలా అహ్మద్ టినుబు ప్రభుత్వం దీనిని శాంతిభద్రతల సమస్యగా భావించి...పోలీసులను, సైన్యాన్ని మోహరించి పరిస్థితిని అదుపు చేయాలని చూస్తోంది.

గిడ్డంగులకు ఆహారధాన్యాల లోడ్లు వచ్చినప్పుడు... పగలైనా, రాత్రయినా జనం భారీ సంఖ్యలో గుమిగూడసాగారు. ఈ గుంపులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించినా ఎలాంటి ప్రభావం కనిపించడం లేదు. లాఠీ ఛార్జి చేసినా ఫలితం వుడడంలేదు. ఇలా వుండగా జనం రాళ్లు రువ్వి పోలీసులను వెంబడించారన్న ప్రత్యక్ష సాక్షుల మాటలను మీడియా ఉటంకిస్తున్నది. కొన్ని చోట్ల సైన్యం కాల్పులు జరిపినప్పటికీ ఆగ్రహించిన గుంపు చెదరకపోగా ట్రక్కుల్లోని ఆహార ధాన్యాలను స్వాధీనం చేసుకుంటున్నాయి. నైజీరియాలో ఆకలితో నకనక లాడుతున్న వారి ముందు...బాష్పవాయువు, లాఠీలు, బుల్లెట్లు ఏవీ పనిచేయడం లేదు.

2023 మొదటి త్రైమాసికంలో, 6.6 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతతో ఇబ్బందులు పడ్డారు. 2024 మొదటి త్రైమాసికం నాటికి, ఈ అన్నార్తుల సంఖ్య 10 కోట్ల పైకి చేరుకుంది. అంటే, నైజీరియా మొత్తం జనాభాలో దాదాపు 45 శాతం మంది తీవ్ర ఆహార కొరతలో వున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం నివేదిక ప్రకారం, ఆ దేశంలో 1.86 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆకలితో ఉన్నారు. మరో 4.37 కోట్ల మంది తీవ్రమైన ఆకలి అంచున ఉన్నారు. కాగా, ఆహార ధాన్యాల ధరలు అంతకంతకు పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ద్రవ్యోల్బణం రేటు ఈ ఫిబ్రవరిలో 39 శాతం వుండగా ఫిబ్రవరి 2023లో 25 శాతం వుంది. కేవలం ఒక్క సంవత్సరంలోనే 14 శాతం పెరుగుదల వుంది.

ఐ.ఎం.ఎఫ్ 1990 ప్రారంభం నుంచి అనుసరించిన నయా ఉదారవాద విధానాలు ఈ పరిస్థితికి దారితీశాయి. నైజీరియాలో 40 శాతానికి పైగా భూమి వ్యవసాయ యోగ్యమైనది. సారవంతమైనది కూడా. జనాభాలో 70 శాతానికి పైగా పని చేసే వయస్సు గల యువత. ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు నేతృత్వంలోని నయా ఉదారవాద విధానాలను గుడ్డిగా అమలు చేసినందుకు పర్యవసానంగా ఈ దేశం తీవ్రమైన ఆహార కొరత కోరల్లో చిక్కుకుంది. వ్యవసాయోత్పత్తిని, ముఖ్యంగా ఆహారధాన్యాలను పెంచడం ద్వారా ఆహార స్వయంసమృద్ధిని సాధించడానికి బదులుగా అంతర్జాతీయ మార్కెట్ నుండి దిగుమతులపై ఆధారపడటం ప్రస్తుత సంక్షోభానికి కారణం.

ఐ.ఎం.ఎఫ్ సలహా మేరకు 2023 మే మాసంలో టినుబు ప్రభుత్వం ఇంధన సబ్సిడీని పూర్తిగా తొలగించి వేసింది. దీంతో దేశీయ ఆహార పదార్థాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడింది. ఆ తరువాత, నైజీరియన్ కరెన్సీ 'నైరా' విలువ 2023 జూన్‌లో సరళీకృతం చేయబడింది. ఫలితంగా 'నైరా' మారకం విలువ పతనమైంది. దీంతో దిగుమతులపై ఎక్కువ డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. టినుబు ప్రభుత్వం దిగుమతులను తగ్గించడమే పరిష్కారంగా భావించింది. అదే దేశాన్ని తీవ్ర ఆహార కొరతలోకి, ఆపై అల్లర్లలోకి నెట్టింది.

ఫిబ్రవరి ప్రారంభం నుండి, ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు ప్రారంభించారు. ఫిబ్రవరి 5న, నైజర్ రాష్ట్ర రాజధాని మిన్నాలో మహిళలు ఆహార కొరతను నిరసిస్తూ ప్రధాన రహదారిని అడ్డుకున్నారు. ఈ నిరసనలో ముందు వరుసలో వున్న 25 మంది మహిళలను అరెస్టు చేయడంతో, ఆందోళన ఇతర నగరాలకు కూడా వ్యాపించింది. ఫిబ్రవరి 21న, చేపల ధరల పెరుగుదలను నిరసిస్తూ, నైజర్ స్టేట్ లోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన సులేజాలో రద్దీగా ఉండే అబుజా-సులేజా-కడునా రహదారిని ఆగ్రహించిన యువకులు దిగ్బంధించారు. తరువాత ఫిబ్రవరి 27న, వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, చిన్న దుకాణాల యజమానులు వీధుల్లోకి రావడం కనిపించింది.

ఆకాశాన్నంటుతున్న ఆహార పదార్థాలు, ఇతర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా 'నైజీరియన్ లేబర్ కాంగ్రెస్' (ఎన్.ఎల్.సి) దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ప్రకటించినప్పుడు సమ్మె సరైన దిశను తీసుకుంది. నైజీరియాలో తాము సమ్మెకు దిగాల్సిన పరిస్థితి గురించి ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకుడు జో అజెరో మాట్లాడుతూ, "ప్రభుత్వ ఉద్యోగులు కూడా వారి జీతాలతో రోజుకు మూడు పూటలూ తినలేని పరిస్థితి వుంద"న్నాడు. కార్మికులు రోడ్లపై బైఠాయిస్తున్నారు. సంఘటిత కార్మికుల నోళ్లు మూయిస్తే ప్రజలు వీధిన పడకుండా అడ్డుకోగలమని పాలకులు భావిస్తున్నారని ఎన్.ఎల్.సి చైర్‌పర్సన్ యూసుఫ్ అంటున్నాడు. రెండు నెలలకు పైగా గడిచినా ఆందోళన ఇంకా కొనసాగుతోంది. నిరసనలు తెలియచేయడాన్ని నేరపూరితంగా మార్చకుండా చూసేందుకు సంఘటిత కార్మిక ఉద్యమం ముందుకు వచ్చింది.

/'థాట్ వీక్లీ' సౌజన్యంతో/

సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఎస్‌ఎల్‌యు ప్రోటోకాల్ సవరణ

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సింబల్ లోడింగ్ యూనిట్ల (ఎస్‌ఎల్‌యు) నిర్వహణ, స్టోరేజికి సంబంధించి వివరణాత్మక ప్రోటోకాల్‌ను భారత ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఎస్‌ఎల్‌యు అనేది వివిప్యాట్ లేదా పేపర్ ట్రయల్ మెషీన్లలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు, గుర్తులను అప్‌లోడ్ చేస్తుంది. ఇప్పటి వరకూ ఎస్‌ఎల్‌యులను స్థానిక ఎన్నికల అధికారులకు పోలింగ్‌కు ముందు బెల్ ఇంజినీర్లు లేదా ఎన్నికల కమిషన్ అధికారులు అందజేసేవారు. పోలింగ్ ముగిసిన ఒక రోజు తరువాత ఎస్‌ఎల్‌యులను వారు మళ్లీ స్వాధీనం చేసుకునేవారు. ఇటీవల సుప్రీంకోర్టు 'ఎన్నికల ఫలితాలు వెల్లడైన కనీసం 45 రోజుల పాటు ఎస్‌ఎల్‌యులను సీల్ చేసిన కంటైనర్‌లో భద్రపరచాలి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)తో పాటు స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచాలి' అని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలకు అనుగుణంగా, మే 1 నుంచి ఎస్‌ఎల్‌యుల నిర్వహణ, స్టోరేజి కోసం కొత్త ప్రోటోకాల్స్ జారీ చేసినట్లు ఎన్నికల కమిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. సవరించిన ప్రోటోకాల్స్ ప్రకారం ఎస్‌ఎల్‌యుల నిర్వహణ, స్టోరేజి కోసం అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ఇసి ఆదేశించింది. తగిన సంఖ్యలో ఎస్‌ఎల్‌యు కంటైనర్లు (సాధారణంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు నుంచి నాలుగు చొప్పున) సిద్ధంగా ఉంచుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. నూతన ప్రోటోకాల్స్ మే 1న లేదా ఈ తరువాత సింబల్ లోడింగ్ ప్రక్రియ చేపట్టిన అన్ని సందర్భాలకు వర్తిస్తుందని కమిషన్ స్పష్టం చేసింది.

నిరాధారం... కల్పితం

- ప్రబీర్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధం లేదు
- నిరసనకారులకు డబ్బు పంచలేదు
- విమర్శిస్తే భారత్ వ్యతిరేకత అంటున్నారు
- ఢిల్లీ పోలీసుల చార్జిషీటుపై 'న్యూస్‌క్లిక్' వివరణ



న్యూఢిల్లీ : పోర్టల్ పైన, ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థపైన ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటుకు సంబంధించి మీడియాలో వచ్చిన ఆరోపణలను న్యూస్‌క్లిక్ తోసిపుచ్చింది. తన వివరణ తీసుకోకుండానే ఛార్జిషీటులోని ఆరోపణలను ప్రచురించారని తెలిపింది. దీనిపై న్యూస్‌క్లిక్ పోర్టల్ ఇచ్చిన వివరణలు...

మీడియా విచారణను కోరుకోవడం లేదని మేము ఎప్పటి నుండో చెబుతూనే ఉన్నాము. న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశాలను చర్చించాలని మేము భావించడం లేదు. న్యాయ ప్రక్రియపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. అయితే ఆరోపణల తీవ్రత, వాటిని కూడా తరచుగా చేస్తుండడం, అవి పూర్తిగా అసంబద్ధంగా ఉండడం వంటి పరిణామాల దృష్ట్యా మేము కొన్ని విషయాలను ప్రస్తావించాలని అనుకుంటున్నాము. న్యూస్‌క్లిక్ పైన, ప్రబీర్ పుర్కాయస్థ పైన చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం. న్యూస్‌క్లిక్ కానీ, ప్రబీర్ కానీ ఎలాంటి ఉగ్రవాద చర్యకు పాల్పడలేదు. అందుకు తగిన ఆధారమూ లేదు. ప్రబీర్‌కు ఏ ఉగ్రవాద గ్రూపుతోనూ సంబంధాలు లేవు.

అవి విచారణాధికారి ఆరోపణలే

ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం, న్యాయపరమైన ప్రక్రియలను పెండింగులో ఉంచడమే వారి లక్ష్యం. అందుకు అనుగుణంగానే వారు ఈ సమయంలో ఇలాంటి వార్తలు వండి వారుస్తున్నారు. ఏప్రిల్ 30వ తేదీనే అభియోగాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం దాఖలు చేసిన ఛార్జిషీటును ఉద్దేశపూర్వకంగానే లీక్ చేశారు. విచారణాధికారి అభిప్రాయాలనే ఛార్జిషీటులో పొందుపరుస్తారు తప్ప మరేమీ కాదు. వాటినే ఆరోపణలుగా చూపుతారు. వీటిని న్యూస్‌క్లిక్, ప్రబీర్ దృఢంగా ఎదుర్కొంటారు.

అంతా పబ్లిక్ డొమైన్‌లో ఉంది

ప్రబీర్‌కు సిపిఎంతో దీర్ఘకాల అనుబంధం ఉంది. ఆయన గత యాభై సంవత్సరాలుగా ఆ పార్టీలో సభ్యుడు. దీనర్థం ఏమంటే ఆయన ఎప్పుడూ మావోయిస్టులకు కానీ, లష్కరే తోయిబాకు కానీ లేదా హింసాత్మక, చట్టవ్యతిరేక ప్రణాళికలు ఉన్న ఏ ఇతర గ్రూపు, వ్యక్తులకు మద్దతు ఇవ్వలేదు. ఆర్థికంగా లేదా ఇతరత్రా సాయపడలేదు. ఆయన రాజకీయ ప్రమేయం, అభిప్రాయాలు ప్రజాక్షేత్రంలో కన్పిస్తూనే ఉంటాయి. అనేక మీడియా సంస్థల మాదిరిగానే న్యూస్‌క్లిక్ కూడా దేశంలో జరిగే ప్రధాన పరిణామాలను ప్రజలకు అందిస్తుంది. రైతుల నిరసనలు, సిఎఎ - ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలు కూడా అందించింది. మా పాత్రికేయుల పనులు పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి. వాటిలో రహస్యమేమీ లేదు. న్యూస్‌క్లిక్ కానీ, ప్రబీర్ కానీ నిరసనకారులకు పంచేందుకు నగదు ఇవ్వలేదు. అల్లర్లను ప్రోత్సహించలేదు. న్యూస్‌క్లిక్ తన న్యూస్ బులెటిన్లు, వార్తల్లో మ్యాపులకు సంబంధించి అన్ని నిబంధనలను పాటిస్తోంది. అదంతా పబ్లిక్ డొమైన్‌లో ఉంది. కోవిడ్ కష్టకాలంలో నిపుణులతో చర్చించి, వారి వ్యాఖ్యలను ప్రచురించింది. కోవిడ్ వ్యాక్సినేషన్‌కు సంబంధించి న్యూస్‌క్లిక్‌లో వచ్చినదంతా ఆర్టికల్స్, వీడియోల రూపంలో పోర్టల్‌లో అందరికీ అందుబాటులోనే ఉంది.

స్వతంత్ర జర్నలిజం లక్ష్యంగా...

మా స్వతంత్ర జర్నలిజంను లక్ష్యంగా చేసుకొని ఢిల్లీ పోలీసులు, ఇతర సంస్థలు విచారణలు చేస్తున్నాయని మేము మరోసారి పునరుద్ఘాటిస్తున్నాము. ప్రభుత్వ విధానాలను విమర్శించినా, నిరసన వార్తలను అందించినా దానిని భారత్ వ్యతిరేక చర్యగా చిత్రిస్తున్నారు. మాపై మోపిన ఆరోపణలన్నీ నిరాధారమైనవి. కల్పితమైనవి. 'రక్షణ కల్పిస్తున్న సాక్షులు' ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా ఈ ఆరోపణలు చేస్తున్నారు. వీటిని న్యాయస్థానంలో నిరూపించాల్సి ఉంటుంది. వీటిని కోర్టుల్లో న్యూస్‌క్లిక్ తగిన సమయంలో ఎదుర్కొంటుంది. ప్రబీర్, న్యూస్‌క్లిక్, మా పాత్రికేయుల కృషి యావత్తూ సమర్థనీయమేనని మేము విశ్వాసంతో ఉన్నాము.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎమ్‌డి సలీం

లెఫ్ట్ ఫ్రంట్‌కు మద్దతుగా బహిరంగ సభ

ముర్షిదాబాద్ : ముర్షిదాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎమ్‌డి సలీంకు మద్దతుగా జలంగి గ్రామంలోని బాగ్వారా విద్యాలయ మైదానంలో జరిగిన సభకు జనం పోటెత్తారు. దేశానికి, రాష్ట్రానికి ప్రమాదంగా తయారైన బిజెపి, టిఎంసిలను తరిమికొట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. సభలో ఎమ్‌డి సలీంతోపాటు పార్టీ నాయకులు మీనాక్షి ముఖర్జీ తదితరులు ప్రసంగించారు.

ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : ఢిల్లీలో బాంబుల బెదిరింపులు కలకలం రేపాయి. ఢిల్లీ వ్యాప్తంగా ఇ-మెయిల్స్ ద్వారా సుమారు 60కి పైగా పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పాఠశాలల యాజమాన్యాలు పోలీసులకు సమాచారమిచ్చాయి. పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు తెలిపారు. ముందుగా చాణక్యపురిలోని సంస్కృతి స్కూల్, మయూర్ విహార్‌లోని మదర్ మేరీ స్కూల్, ద్వారకాలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి బెదిరింపులు వచ్చాయని, అనంతరం ఢిల్లీతో పాటు నొయిడాలోని సుమారు 60కి పైగా పాఠశాలలకు ఈ మెయిల్స్ వచ్చాయని అధికారులు చెప్పారు. ఈ పాఠశాలల్లో ఒకటైన మదర్ మేరీ స్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇ-మెయిల్ రావడంతో పరీక్షను నిలిపివేశారు. తమ పిల్లలను తీసుకువెళ్లాల్సిందిగా తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. "బాంబు బెదిరింపులు వచ్చిన పాఠశాలల్లో తగిన చర్యలు తీసుకున్నాం. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. తల్లిదండ్రులు భయపడవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం " అని ఢిల్లీ పోలీస్ ప్రతినిధి తెలిపారు. భయాందోళనలు సృష్టించేందుకు ఒకే ఈ-మెయిల్‌ను పలు పాఠశాలలకు పంపారని, ఇ-మెయిల్ ఐపి అడ్రస్‌ను గుర్తించేందుకు సైబర్ పోలీసులు యత్నిస్తున్నారని తెలిపారు.

ఘనంగా మేడే

మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేకి : ప్రకాష్ కరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో మేడే ఘనంగా జరిగింది. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. వాటిని తిప్పికొట్టేందుకు సిపిఎం పోరాడుతోందని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్మికులను కొట్టి, కార్పొరేట్లకు దోచిపెడుతుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని బిజెపి పాలకుల దమనకాండపై ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అభ్యర్థించారు. మోడీ ప్రభుత్వం కార్మికుల పొట్టకొడుతూ వారి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులకు మేలు చేయని కాషాయ ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందని అన్నారు. పదేళ్ల తన పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని, పూర్తి సినిమా ముందుందన్న ప్రధాని మోడీ వ్యాఖ్యల గురించి ప్రస్తావిస్తూ తమ హక్కులను పూర్తిగా కాలరాసిన పాలన ట్రైలర్ అయితే ఇక రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందోనని వ్యవసాయ కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆమె పేర్కొన్నారు. మోడీ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు కార్యాలయంలో మేడే

సిఐటియు కేంద్ర కార్యాలయం (బిటిఆర్ భవన్)లో మేడే ఘనంగా జరిగింది. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జెఎస్ మజుందార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెఎస్ మజుందార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కార్మిక కోడ్ లను తెచ్చారని దుయ్యబట్టారు. దీనివల్ల కార్మికుల హక్కులు నిర్వీర్యం చేస్తున్నారని, కార్మికుల సామాజిక భద్రత ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ఈ కార్యాలయంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని సిఐటియు కేంద్ర కార్యాలయంలో మేడే వేడుకలు



సిపిఎం కార్యాలయంలో పతాకావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ప్రకాశ్‌కరత్

కొవిషీల్డ్ ముప్పుపై దర్యాప్తు కమిటీ

- సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ : కొవిషీల్డ్ వ్యాక్సిన్ భద్రతా అంశాలపై వివాదం బుధవారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ వ్యాక్సిన్ వేసుకున్నందు వల్ల తలెత్తే రిస్క్ కారణాలపై అధ్యయనం చేసేందుకు నిపుణులతో కూడిన మెడికల్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. "దేశంలో 175కోట్లకు పైగా కొవిషీల్డ్ డోస్‌లు వేశారు. కోవిడ్ వచ్చిన తర్వాత గుండెపోటుతో, అకస్మాత్తుగా వ్యక్తులు కుప్పకూలి మరణించడం వంటి సంఘటనలు పెరిగాయి. యువకుల్లో కూడా గుండెపోటు కేసులు పెరిగాయి. తాజాగా కొవిషీల్డ్ డెవలపర్ బ్రిటన్ కోర్టులో దాఖలు చేసిన డాక్యుమెంట్ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలకు వేసిన కొవిషీల్డ్ వ్యాక్సిన్ ప్రమాదకర పర్యవసానాల ముప్పుపై ఆలోచించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. "అని న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్ పేర్కొంది. అత్యంత అరుదైన కేసుల్లో రక్తంలో ప్లేట్‌లెట్‌ల సంఖ్య తగ్గిపోవడం, రక్తం గడ్డ కట్టడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం వుండవచ్చని ఈ వ్యాక్సిన్‌ను రూపొందించిన ఆస్ట్రాజెనికా కంపెనీ పేర్కొందని ఆ పిటిషన్ తెలిపింది. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత రక్తం గడ్డ కట్టడం, గుండెపోటు వంటి సమస్యలు పెరిగాయని అంతర్జాతీయంగా జరిగిన అధ్యయనాల్లో వెల్లడైంది. ఎయిమ్స్‌కి చెందిన నిపుణుడి నేతృత్వంలో మెడికల్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని, రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ సాగాలని పిటిషన్ పేర్కొంది. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు లేదా మరణించిన వారి కుటుంబాలకు లేదా ఆ వ్యక్తులకు వ్యాక్సిన్ నష్టపరిహార చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని తివారీ కోరారు.

ఇద్దరు ఢిల్లీ కాంగ్రెస్ సీనియర్ నేతల రాజీనామా

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఇద్దరు సీనియర్ నేతలు బుధవారం రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే, వెస్ట్ ఢిల్లీ పార్లమెంటరీ సీటు పార్టీ పరిశీలకులు నీరజ్ బసోయా, మాజీ ఎమ్మెల్యే, నార్త్‌వెస్ట్ ఢిల్లీ పార్లమెంటరీ సీటు పార్టీ పరిశీలకులు నసీబ్ సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. ఆప్‌తో పొత్తు కారణంగానే పార్టీని వీడుతున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వారిరువురు వేర్వేరుగా రాసిన లేఖల్లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఢిల్లీ కాంగ్రెస్ యూనిట్ చీఫ్ అరివింద్ సింగ్ లవ్లీ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య!

కోటా: దేశంలో పోటీ పరీక్షలకు కేంద్రంగా మారిన కోటా (రాజస్థాన్) నగరంలో.. పరీక్షల ఒత్తిడి మరో విద్యార్థిని బలితీసుకుంది. సారీ నాన్నా.. అంటూ ఆ విద్యార్థి సూసైడ్ లేఖ రాసి మంగళవారం ఉరివేసుకుని మరణించాడు. మృతుడిని పోలీసులు భరత్ కుమార్ రాజ్‌పుత్‌గా గుర్తించారు. గత 48 గంటల్లో వెలుగు చూసిన రెండో ఆత్మహత్య కేసు కావడంతో స్థానికంగా కలకలం రేగుతోంది. భరత్ కుమార్ రాజ్‌పుత్ ఇప్పటికే నీట్ పరీక్షకు రెండుసార్లు హాజరయ్యాడు. మరోసారి సన్నద్ధమవుతూ, తన బంధువు రోహిత్‌తో కలిసి హాస్టల్ గదిలో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 10.30 సమయంలో రోహిత్ ఏదో పనిమీద బయటకు వెళ్లగా భరత్ ఆత్మహత్య చేసుకున్నాడు. గంట తరువాత తిరిగొచ్చిన రోహిత్ కిటికీ లోంచి చూడగా భరత్ ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. "సారీ నాన్నా, ఈ ఏడాదీ నేను సక్సెస్ కాలేకపోయాను" అని భరత్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో భరత్ తీవ్ర ఒత్తిడిలో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల ప్రాథమిక అంచనాకు వచ్చారు.

దక్షిణాసియాలో ఈసారి వానలే వానలు..

దక్షిణాసియా: ఈ ఏడాది దక్షిణాసియాలో వానలే వానలు కురుస్తాయని సౌత్ ఆసియా క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం (ఎస్‌ఎఎస్‌సివోఎఫ్) తెలిపింది. నైరుతి రుతుపవనాల కాలంలో దక్షిణాసియా అంతటా సాధారణాన్ని మించి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆగస్టు - సెప్టెంబరు మధ్య అనుకూల లానినో పరిస్థితులతో భారత్‌లో సాధారణం కంటే అధికంగానే వానలు పడతాయని ఇప్పటికే పలు క్లైమేట్ అంచనా సంస్థలు చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా ఎస్‌ఎఎస్‌సివోఎఫ్ అంచనాలు వాటికి మరింత బలం చేకూరుస్తున్నాయి. 2024 నైరుతి రుతుపవనాల కాలం (జూన్ - సెప్టెంబరు)లో దక్షిణాసియాలోని అత్యధిక ప్రాంతాల్లో సాధారణాన్ని మించి వర్షాలు కురుస్తాయని ఎస్‌ఎఎస్‌సివోఎఫ్ పేర్కొంది. కొన్ని ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో సాధారణం కంటే కొంచెం తక్కువ వానలు పడతాయని తెలిపింది. ఎస్‌ఎఎస్‌సివోఎఫ్ తాజా అంచనాలను ఈ ప్రాంతంలోని తొమ్మిది వాతావరణ విభాగాలు సంయుక్తంగా రూపొందించాయి. ఇందుకు అంతర్జాతీయ నిపుణుల సహాయాన్ని తీసుకున్నాయి.



ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించబోమని రాసివ్వండి

- గుజరాత్ ప్రచారంలో కాంగ్రెస్‌కు మోడీ డిమాండ్

గాంధీనగర్ : ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించబోమని ప్రజలకు రాసి ఇవ్వాలని కాంగ్రెస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగాన్ని మార్చబోమని కాంగ్రెస్ ప్రతిజ్ఞ చేయాలని కూడా కోరారు. బుధవారం గుజరాత్‌లోని బనాస్కంథలో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వారసత్వ హక్కును అమలు చేసే యోచనలో కాంగ్రెస్ ఉందని అన్నారు. 'కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మీకు రెండు గేదెలు ఉంటే ఒక గేదెను కాంగ్రెస్ తీసుకుంటుంది' అని మోడీ చెప్పారు. సబర్‌కాంత జిల్లాలోని హిమత్‌నగర్‌లోనూ మోడీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిజెపి ప్రభుత్వాన్ని ఎదుర్కొనడానికి కాంగ్రెస్ నకిలీ వీడియోలను వ్యాప్తి చేస్తోందని విమర్శించారు. మత ఆధారిత రిజర్వేషన్ల కోసం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల రిజర్వేషన్లు తగ్గించే ఆలోచనలో కాంగ్రెస్ ఉందని అన్నారు. ట్రిపుల్ తలాక్ పద్ధతికి ముగింపు పలికి ముస్లిం మహిళలకు సాయం చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు.

ప్రజ్వల్ లైంగిక వేధింపులపై పెదవి విప్పని మోడీ

- ప్రధాన మీడియాలోనూ కానరాని కథనాలు
- స్వదేశం తీసుకొచ్చేందుకు సహకరించండి : ప్రధానికి సిద్ధరామయ్య లేఖ

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమయంలో కర్ణాటకలో బిజెపి భాగస్వామ్య పక్షమైన జెడిఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు దేశ రాజకీయాలను కుదిపివేస్తున్నాయి. మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మనుమడైన ప్రజ్వల్ హసన్ లోక్‌సభ స్థానం నుండి మరోసారి బరిలో దిగారు. అక్కడ ఇప్పటికే పోలింగ్ జరిగింది. ప్రజ్వల్ వ్యవహారాన్ని గత డిసెంబరులోనే బిజెపి నాయకత్వం తన మిత్రపక్షం దృష్టికి తెచ్చింది. అయినప్పటికీ జెడిఎస్ పెద్దలు ప్రజ్వల్‌ను హసన్ నుండి, ఆయన తండ్రి హెచ్‌డి రేవణ్ణను మాండ్యా నుండి పోటీకి దింపారు. రాష్ట్రంలో జరిగిన ఓ ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోడీ వీరిద్దరికీ మద్దతు కూడా ఇచ్చారు. ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ ఇప్పటి వరకూ ప్రధాని మోడీ కానీ, జాతీయ మహిళా కమిషన్ కానీ, కేంద్ర మహిళ, శిశుసంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ కానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మరోవైపు పలు జాతీయ ఛానల్స్‌లో ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపులపై ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

న్యూస్18 ఇండియా ఛానల్‌లో యాంకర్ రుబికా లియాకత్ సోమవారం రాత్రి రెండు షోలు నిర్వహించారు. ఒక దానిలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై చర్చ జరిగింది. మరో దానిలో ఆ ఛానల్‌కు మోడీ ఇచ్చిన ఇంటర్వ్యూపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో మోడీపై రుబికా ప్రశంసలు కురిపించారు. ఇంకో ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఆ రోజు చోటుచేసుకున్న టాప్ 50 వార్తా కథనాలలో రేవణ్ణ ఉదంతానికి చోటే ఇవ్వలేదు. ఇక ఆజ్‌తక్ న్యూస్ ఛానల్ యాంకర్లు చిత్రా త్రిపాఠీ, అంజనా ఓం కశ్యప్ తాము రూపొందించిన కార్యక్రమాలలో రేవణ్ణ ఉదంతాన్ని ప్రస్తావించనే లేదు. శ్వేతా సింగ్ మాత్రం ప్రజ్వల్ లైంగిక వేధింపుల వార్తకు కేవలం రెండు నిమిషాలు కేటాయించారు. టైమ్స్ నౌ ఛానల్‌లో యాంకర్ నావిక కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫేక్ వీడియోపై కార్యక్రమాన్ని అందించారు. ఇంగ్లీషు కార్యక్రమంలో మాత్రం ఆమె ప్రజ్వల్ లైంగిక వేధింపులపై పదిహేను నిమిషాల పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉదంతంపై కాంగ్రెస్, బిజెపి నేతలను ప్రశ్నించారు.

ఏడు రోజుల సమయం ఇవ్వండి : సిట్‌ను కోరిన ప్రజ్వల్

లైంగిక వేధింపుల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు విచారణకు హాజరుకావడానికి హస్సన్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ ఏడు రోజుల సమయం కోరాడు. 'నా క్లయింట్ భారత్‌లో లేరు. నోటీసులు జారీ చేసిన సమాచారాన్ని అతనికి అందించాం. బెంగుళూరు రావడానికి, విచారణకు హాజరు కావడానికి నా క్లయింట్ ఏడు రోజుల సమయం కోరారు. అలాగే విచారణకు హాజరుకావడానికి మరొక రోజును మంజూరు చేయాలని కోరుతున్నాను' అని సిట్ అధికారులకు ప్రజ్వల్ తరుపున న్యాయవాది జి. అరుణ్ విజ్ఞప్తి చేశారు. దౌత్య పాస్‌పోర్టు ద్వారా ఏప్రిల్ 28న బెంగళూరు నుంచి జర్మనీకి ప్రజ్వల్ వెళ్లినట్లు తెలిపారు. 'నేను బెంగళూరులో లేను. సిఐడి బెంగళూరు అధికారులతో నా న్యాయవాదుల ద్వారా సంప్రదింపులు జరుపుతున్నాను. త్వరలో సత్యం గెలుస్తుంది' అని ప్రజ్వల్ రేవణ్ణ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.

ప్రజ్వల్‌ను స్వదేశానికి తీసుకొచ్చేందుకు సహాయం చేయండి : ప్రధానికి సిద్ధరామయ్య లేఖ

ప్రజ్వల్ రేవణ్ణను స్వదేశానికి తీసుకొని రావడానికి సహాయం చేయాలని ప్రధాని మోడీకి కర్ణాటక సిఎం సిద్ధరామయ్య లేఖ రాసారు. అతని పాస్‌పోర్టును రద్దు చేయాలని కోరారు. తద్వారా రేవణ్ణను విచారణ సంస్థలు దేశానికి తీసుకొచ్చి విచారించవచ్చునని సిద్ధరామయ్య లేఖలో తెలిపారు. 'మహిళలపై ప్రజ్వల్ చేసిన అఘాయిత్యాలపై విచారణ చేయడానికి సిట్ 24 గంటలూ పని చేస్తోంది. అతన్ని స్వదేశానికి తీసుకురావడం చాలా ముఖ్యం, తద్వారా అతను దేశంలోని చట్టాల ప్రకారం విచారణను, దర్యాప్తును ఎదుర్కొంటాడు' అని సిద్ధరామయ్య తన లేఖలో పేర్కొన్నారు.

ఖరీదైన భోజనం!

(మొదటిపేజీ తరువాయి)

కార్మికునికి జీతం చెల్లిస్తారని భావిస్తేనే ఇదంతా లెక్కలోకి వస్తుంది. ఇక రెగ్యులర్ వేతనాలు పొందే కార్మికుల విషయంలో ఇదే కాలంలో 8.1 శాతం నుండి 10.1శాతానికి గణనీయంగా పెరిగింది (పట్టిక- 4).

2, 3 పట్టికలను చూసినట్లైతే, ఒక భోజనం తయారుచేయడానికి అయ్యే ఖర్చు గత ఐదేళ్లలో 71శాతం పెరిగింది. అదే సమయంలో నెలవారీ వేతనాలు మాత్రం కేవలం 37శాతం మాత్రమే పెరిగాయని అర్థమవుతుంది. 3, 4 పట్టికలను చూసినట్లైతే, క్యాజువల్ కార్మికుల వేతనాలు, పెరిగిన ఆహార ధరలను పోల్చి చూస్తే ఈ అంతరం మరింత ఎక్కువగా ఉంటుంది. వారు ఇప్పటికే ఆహారంపై తమ ఆదాయాల్లో 20శాతానికి మించి ఖర్చు చేయాల్సి వస్తోంది. వేతనాల్లో, వ్యయాల్లో ఈ అసమానతల వల్ల రెగ్యులర్ వేతన జీవుల కుటుంబాలు నిత్యావసరం కాని ఇతర వస్తువులపై, విలాసవంతమైన ఉత్పత్తులపై పెట్టే ఖర్చును తగ్గించుకోవాల్సి వస్తుంది. ఇక రోజువారీ కూలీల కుటుంబాల పరిస్థితి గురించి వేరే చెప్పనక్కర్లేదు. విలాసాల గురించి వారు మరచిపోవాల్సిందే.

టేబుల్ 2 : 2024 మార్చిలో ఒక భోజనం ఖర్చు, ఐదేళ్ళ క్రితం అయిన ఖర్చు వివరాలు

వ్యయం	2024 మార్చికి	ఏడాది క్రితం	ఐదేళ్ల క్రితం
రెండు భోజనాల తయారీకి	రూ.79.2	రూ.64.2	రూ.46.2
ఒక భోజనం తయారీకి	రూ.39.6	రూ.32.1	రూ.23.1
నెలలో ప్రతీ రోజూ రెండు భోజనాల తయారీ	రూ.2,377.4	రూ.1,925.7	రూ.1,386.7

టేబుల్ 3 : మహారాష్ట్ర పట్టణ ప్రాంతాల్లో క్యాజువల్ కార్మికుని సగటు రోజువారీ వేతనం, రెగ్యులర్ వేతన ఉద్యోగి సగటు వేతనం

మహారాష్ట్రలో సగటు ఆదాయాలు	మార్చి నాటికి	ఏడాది క్రితం	ఐదేళ్ల క్రితం
సిడబ్ల్యుఎస్‌లో ఇతర పబ్లిక్ వర్క్సులో కాకుండా క్యాజువల్ లేబర్ వర్క్‌లో ఒక వ్యక్తి రోజుకు సగటు సంపాదన	రూ.364.93	రూ.328.24	రూ.218.35
సిడబ్ల్యుఎస్‌లో ఒక రెగ్యులర్ ఉద్యోగి నెలవారీ సంపాదన	రూ.23,549.45	రూ.21,810.82	రూ.17,189.56

సిడబ్ల్యుఎస్‌లో ఇతర పబ్లిక్ వర్క్సులో కాకుండా క్యాజువల్ లేబర్ వర్క్ నుండి రోజుకు ఒక వ్యక్తి పొందే సగటు ఆదాయం

కొలంబియా వర్శిటీలో 17వరకు పోలీసుల మకాం!

- నాటకీయ రీతిలో లోపలకు ప్రవేశించిన పోలీసులు
- బస్సుల్లో విద్యార్థుల తరలింపు
- 48మంది అరెస్టు



కేంపస్ భవనంలోని హమిల్టన్ హాల్‌లోకి కిటికి నుండి ప్రవేశించడానికి ర్యాంప్‌పై వెళ్తున్న న్యూయార్క్ పోలీసులు

న్యూయార్క్ : గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనలు సాగిస్తున్న నేపథ్యంలో కొలంబియా యూనివర్శిటీలో మంగళవారం రాత్రి నాటకీయ దృశ్యాలు చోటు చేసుకున్నాయి. కేంపస్ భవనంలోని హమిల్టన్ హాల్‌ను విద్యార్థులు ఆక్రమించుకోవడంతో ఆ భవనం కిటికి నుండి లోపలకు ప్రవేశించడానికి న్యూయార్క్ పోలీసులు ప్రయత్నించారు. ఇందుకోసం వారు మిలటరీ గ్రేడ్ వాహనంలో వచ్చి, ర్యాంప్‌ను ఉపయోగించారు. రాత్రి 9.30గంటల సమయంలో డజన్ల సంఖ్యలో న్యూయార్క్ పోలీసులు వర్శిటీలోకి ప్రవేశించారు. గాజా సంఘీభావ శిబిరం, హమిల్టన్ హాల్‌తో సహా కేంపస్‌లోని కీలకమైన ప్రాంతాలను చుట్టుముట్టారు. అదనపు బలగాలు ప్రధాన గేటు గుండా కేంపస్‌లోకి ప్రవేశించాయి. పొగ బాంబులు వేసి ఆందోళనకారులను చెల్లాచెదురు చేశారు. ఈలోగా అధికారులు హమిల్టన్ హాల్లోకి ప్రవేశించారు. ఆ ప్రాంతం నుండి విద్యార్థులందరినీ పంపించేవరకూ మొత్తంగా కేంపస్‌ను లాక్‌డౌన్ చేశారు. హమిల్టన్ హాల్లోకి మీడియాను, విద్యార్థి జర్నలిస్టులను వెళ్లనివ్వకుండా అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం రాత్రి దాదాపు 48మందిని అదుపులోకి తీసుకున్నారు. మూడు శిబిరాలను ధ్వంసం చేశారు. న్యూయార్క్ సిటీ పోలీసు విభాగానికి చెందిన రెండు బస్సుల నిండా విద్యార్థులను కేంపస్ నుండి తరలించడం కనిపించింది. హమిల్టన్ హాల్‌ను విద్యార్థులు చుట్టుముట్టడంతో గత రెండు వారాల్లో రెండుసార్లు పోలీసులను పిలిపించినట్లు కొలంబియా వర్శిటీ అధికారులు తెలిపారు. మళ్లీ విద్యార్థులు పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ శిబిరాలు వేయకుండా, ఆందోళనలు చేయకుండా వుండేలా చూసేందుకు 17వరకు కేంపస్‌లోనే వుండాల్సిందిగా పోలీసులను కోరినట్లు వర్శిటీ అధ్యక్షుడు తెలిపారు. సోడా యంత్రాలు, కుర్చీలు, ఫర్నీచర్‌లతో హాళ్లలోకి ఎవరినీ రానివ్వకుండా విద్యార్థులు అడ్డుకున్నారని పోలీసులు తెలిపారు. భవనంలోకి వచ్చే ముందు పోలీసులు బాడీ కెమెరాలను స్విచ్ఛాఫ్ చేశారని విద్యార్థులు విమర్శించారు.

పలు యూనివర్శిటీల్లో ఘర్షణలు

కాలిఫోర్నియా యూనివర్శిటీ లాస్‌ఏంజెల్స్ కేంపస్‌లో కూడా హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకున్నాయి. థాంపాలోని యూనివర్శిటీ ఆఫ్ సదరన్ ఫ్లోరిడాలో పోలీసులు విద్యార్థులపై బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. న్యూ మెక్సికో యూనివర్శిటీలో పోలీసులు కాలేజీ స్టూడెంట్ యూనియన్ భవనాన్ని ఆక్రమించుకున్న ఆందోళనకారులను బలవంతంగా తొలగించారు. రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్శిటీలో కాలేజీ పాలనా యంత్రాంగానికి, విద్యార్థులకు మధ్య ఒప్పందం కుదిరింది. యుద్ధంతో ముడిపడిన సంస్థల నుండి నిధులను ఉపసంహరించుకునేందుకు ఓటు వేస్తామని హామీ ఇచ్చిన తర్వాత విద్యార్థులు ఆందోళనలను నిలిపివేశారు.

యుద్ధాన్ని ఆపే ఒప్పందాన్ని ఆమోదించం : నెతన్యాహు

గాజాపై యుద్ధాన్ని ఆపేందుకు ఉద్దేశించిన ఒప్పందాన్ని ఆమోదించేది లేదని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌కు తెలియజేశారు. యుద్ధాన్ని ముగించాలని హమాస్ పట్టుబడితే ఒప్పందం కుదరదని స్పష్టం చేశారు. పైగా రఫాపై మిలటరీ దాడి చేసేలా ఒత్తిడి తీసుకువచ్చినట్లే అవుతుందని చెప్పారు. ఈ మేరకు ఇజ్రాయిల్ మీడియా తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు గానూ బ్లింకెన్ ఇజ్రాయిల్‌లో పర్యటిస్తూ నేతలతో భేటీ అవుతున్నారు. రఫా ఆపరేషన్‌ను అమెరికా ఇప్పటికీ వ్యతిరేకిస్తోందని బ్లింకెన్ నెతన్యాహుకు స్పష్టం చేశారు. గత 24గంటలుగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కొనసాగుతున్న దాడుల్లో ఇజ్రాయిల్ బలగాలు మైనర్‌తోసహా 20మందిని అదుపులోకి తీసుకున్నాయి. గాజాపై దాడుల్లో 33మంది మరణించగా, 57మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకూ గాజాలో మరణించిన వారి సంఖ్య 34,568కి, తీవ్రంగా గాయపడిన వారి సంఖ్య 77,765కి పెరిగింది. ఎనిమిదివేల మందికిపైగా గల్లంతయ్యారు.



మీ కోసం

తులసి ఆకుల్ని రాత్రంతా నీళ్లల్లో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగితే నోటి దుర్వాసన తగ్గుతుంది.

జీవన సౌరభం

ఫలితంపై ఎంత శ్రద్ధ చూపిస్తారో.. దాన్ని పొందే పద్ధతుల్లోనూ అంతే శ్రద్ధ పాటించాలి.

ఇంట్లో తోట - ఆరోగ్యాల పంట



ఆదివారం సెలవు రోజు కావడంతో కమల్ టీవీ చూస్తున్నాడు. కూరగాయల మొక్కల పైన రసాయనాలను పిచికారి చేస్తున్నారని, అలాంటి కాయగూరలను తినడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని టీవీలో చెబుతున్నారు. ఆ విషయంపై కమల్ తీవ్రంగా ఆలోచించాడు. తన అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి తాతయ్య దగ్గరికి వెళ్లి టీవీలో వచ్చిన వార్త గురించి చెప్పాడు.


'అవును. మోతాదుకు మించి రసాయనాలు వాడి పండించిన కాయగూరలు, పండ్లు తినడం వల్ల అంతుచిక్కని రోగాలు వస్తున్నాయి. ఒకప్పుడు మేము ఎలాంటి రసాయనాలు చల్లకుండా వ్యవసాయం చేసేవాళ్లం. అందరం చాలా ఆరోగ్యంగా ఉండే వాళ్ళం. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది' అని తాతయ్య చెప్పాడు. ఆ మాటలు విన్న కమల్‌కి ఓ ఆలోచన వచ్చింది.

ఆ రోజు సాయంత్రం, ఇంటి పరిసరాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని చదును చేసి, రెండు మడులను సిద్ధం చేశాడు. అందులో రకరకాల కూరగాయల విత్తనాలను చల్లాడు. వంటగదిలో కాయగూరలు, పండ్ల తొక్కలతో ఎరువు తయారు చేశాడు. ఇంట్లో నుంచి వచ్చే వ్యర్థ నీటిని కాలువ ద్వారా మడులకు మళ్ళించాడు. వారం రోజుల్లో విత్తనాలు మొలకెత్తాయి. ఇరవై రోజుల్లో రకరకాల ఆకుకూరలు కోతకొచ్చాయి. తరువాత కాయగూరలు వచ్చాయి. కమల్ కృషికి తాతయ్య ఎంతో అభినందించాడు. ఇదే విషయాన్ని కమల్ తన స్నేహితులతో కూడా చెప్పాడు. వారందరూ కూడా 'ఇంటి దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేస్తామ'ని ప్రతిజ్ఞ చేశారు.

- యాడవరం చంద్రకాంత్ గౌడ్,
94417 62105.


చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



నేను గీసిన బొమ్మ





బి.జ్ఞాన్వి,
యూకేజీ,
చిన్న కోడూర్,
సిద్ధిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తాతా మనవళ్ల వంట కథ ..!

ఆ ఐదుగురు మనవళ్లకూ గొప్ప వంటగాళ్లుగా పేరొందాలని, ఇతర దేశాలు వెళ్లి, వంటల మాస్టార్లుగా ఉద్యోగం చేయాలని చాలా కోరికగా ఉండేది. 2018లో ... ఆ కోరిక నెరవేరే తరుణం వచ్చింది. ఆఖరి క్షణం దాకా 'వెళతాం' అనే ఆనందంలోనే వాళ్లున్నారు. కానీ, ఆశాభంగం జరిగింది. వీసా విషయంలో తలెత్తిన ఇబ్బంది వాళ్ల చిరకాల స్వప్నాన్ని చెల్లాచెదురు చేసింది. కానీ, వాళ్లు నిరాశ చెందలేదు. మనవళ్లు అందరి కంటే పెద్దవాడు సుబ్రమణియన్ ... ఒక కొత్త ఆలోచనతో 'విలేజ్ కుకింగ్ ఛానెల్ (విసిసి)'ని ప్రారంభించాడు. తమ తాత పెరియాతంబిని ముందు పీఠిన నిలబెట్టి, వంటలూ, వంట పాఠాలూ మొదలెట్టారు. అదిప్పుడు ఆదరణకు ఆదరణ, ఆదాయానికి ఆదాయం సంపాదిస్తూ, దేశవిదేశాల్లో గొప్ప ప్రాచుర్యం పొందింది.



మనవళ్లతో పెరియాతంబి

తమిళనాడులోని వీరమంగళం చిన్న ఊరు. ఆ ఊళ్లో పెరియాతంబి ఒక రైతు. పదెకరాల సొంత భూమిలో కుటుంబం యావత్తూ ఆరుగాలం శ్రమిస్తూ, అనేక పంటలు పండిస్తూ ఉంటారు. పెరియాతంబికి చిన్నప్పటినుంచీ వంటల తయారీపై ఆసక్తి ఉండేది. వాసన చూసి రుచిని పసిగట్టగల నేర్పుండేది. ఎంతమందికైనా అవలీలగా వంట చేయగల సామర్థ్యం ఉండేది. ఊళ్లో ఏ ఇంట్లో పెళ్లయినా, పెరియాతంబి అక్కడి వంట పనుల్లో కనిపించేవాడు. సలహాలు ఇస్తూ, దినుసుల కొలతలు చెబుతూ, వంటకాల అదనూ పదునూ గమనిస్తూ ... అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. ఆ చొరవా, శక్తీ తరువాతి కాలంలో సొంతంగా వంటల తయారీకి దారి తీసింది. వివిధ సందర్భాల్లో కావాల్సిన వారికి, కావాల్సిన వంటలు తయారు చేసివ్వడం ఒక వ్యాపకంగా మారింది. ఇదంతా అతడి మనవళ్లు చూస్తూ పెరిగారు. తమ తాత చేతివంట గురించి అందరూ గొప్పగా చెబుతుంటే విని, తాము వంట మీద ఆసక్తి పెంచుకున్నారు.

ఆ క్రమంలోనే సుబ్రమణియన్, మురుగేశ్వర్, అయ్యనర్, ముత్తు మణిక్కన్, తమిళ్ సెల్వన్ అనే ఐదుగురు మనవళ్లూ విదేశాల్లో చెఫ్‌లు కావాలని కలలు కన్నారు. అవి కల్లలు కావటంతో 2018లో తమ ఊళ్లోనే వంటల తయారీ పనిని మొదలు పెట్టారు. యూట్యూబ్ ఛానెల్‌లో వాటిని ప్రపంచానికి పరిచయం చేయాలని అనుకున్నారు. గ్రామీణ సంప్రదాయక వంటలను మాత్రమే ఎంచుకున్నారు. ఆ వంటల్లో తమ తాత ఎంత ప్రసిద్ధుడో వారికి తెలుసు. ఇంట్లో ఏదొక మూల వంట చేసి, షూట్ చేయటం కాకుండా, పచ్చని పొలాల్లో, తోటల్లో వంటలు చేయడం మొదలు పెట్టారు. వాళ్లు ఏ కొద్ది పదార్థాలతోనో వంట చేయరు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి, భారీగా దినుసులు తీసుకొస్తారు. రోలు, సన్నికల్లు ఉపయోగించి, ఏ వంటకైనా చేత్తోనే మసాలాలు వంటి కలగలుపు దినుసులు నూరతారు. కనీసం వందమందికి సరిపోయేలా భారీ పాత్రల్లో వంటలు తయారు చేస్తారు.

ఎప్పుడు ఏం చేయాలో, ఏ పదార్థాలను, ఎంతెంత మోతాదులో, ఎలా కలపాలో తాత పెరియాతంబి సలహాలు ఇస్తూ ఉంటాడు. చాలాసార్లు తానే నేరుగా గరిటె చేతబట్టి, దినుసులు వేస్తూ, కలియదిప్పుతూ, కనిపిస్తాడు. అవసరమైనవి అందిస్తూ, మనవళ్లు సహాయపడతారు. ఆ బృందంలోనే ఒకరు ఈ ప్రక్రియ మొత్తాన్ని కెమెరాతో చిత్రీకరిస్తారు. ఇలా తాతా, ఐదుగురు మనవళ్లూ తయారు చేసిన భారీ వంటలను షూటింగ్ తరువాత, సమీపంలో ఉన్న వృద్ధాశ్రమాలకు, బాలల ఆశ్రమాలకు పంచి పెడతారు.

అచ్చమైన గ్రామీణ ప్రాంత నేపథ్యం చూపిస్తూ, ఈ వంటలను తయారు చేస్తారు. గ్రామీణులు ధరించే సాధారణ దుస్తులే ధరిస్తారు. తలపాగా చుట్టి, లుంగీ కట్టి, తాతతో జోకులు వేస్తూ, వేయిస్తూ కార్యక్రమం నడిపిస్తారు. మధ్యలో తాత పాత సినిమా పాటలు, డైలాగులు వినిపిస్తుంటే- మనవలు నవ్వులను పండిస్తారు. పెరియాతంబి వయసు ఇప్పుడు 78. "యాభై ఏళ్లకు పైబడి వంటలు చేస్తున్నాను. చేయిస్తున్నాను. అప్పట్లో ఊళ్లోనూ, చుట్టుపక్కల ఊళ్లల్లోనూ చెప్పుకునేవారు. ఇప్పుడు దేశదేశాల్లో మా వంటల గురించి చెప్పుకుంటున్నారు. ఇది ఈ వయసులో చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. మనవళ్లందరూ ఎక్కడెక్కడికో వెళ్లిపోకుండా, ఇక్కడే మా కళ్ల ముందే ఉంటూ దీని ద్వారా మంచి ఆదాయం పొందగలుగుతున్నారు. ఇంతకన్నా ఆనందం ఇంకేం ఉంటుంది?" అని సంతోషంగా చెబుతున్నాడు పెరియాతంబి.

ఈ ఛానెల్‌ను ఇప్పుడు రెండున్నర కోట్ల మంది ఫాలో అవుతున్నారు. ఇప్పటివరకూ 70 కోట్ల వీక్షణలు నమోదయ్యాయి. అనేక ప్రఖ్యాతమైన గుర్తింపులు, పురస్కారాలూ ఈ ఛానెల్‌కు లభించాయి. కోవిడ్ కాలంలో ఈ ఛానెల్ నుంచి రూ.10 లక్షల విరాళం తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. తమకు నెలకు రూ.12 లక్షల దాకా ఆదాయం లభిస్తుందని సుబ్రమణియన్ చెబుతున్నారు. "2021 జనవరిలో రాహుల్ గాంధీ మా బృందాన్ని కలుసుకొని, అభినందనలు చెప్పారు. మేము వండిన పుట్టగొడుగుల బిర్యానీ రుచి చూసి, చాలా మెచ్చుకున్నారు. ఆ తరువాత మా ఛానెల్‌ని ఫాలో అయ్యేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది." అని చెప్పారు ఆయన.

"నిజానికి మేం విదేశాలకు వెళ్లకుండా ఆటంకం ఏర్పడ్డమే మంచిదైంది. ఇప్పుడు మా సొంత ఊళ్లోనే ఉంటూ ప్రపంచం మొత్తం మమ్మల్ని చూసేలా, మెచ్చుకునేలా యూట్యూబ్ ఛానెల్ అవకాశం కల్పించింది. విదేశాలకు వెళ్లి ఉంటే, డబ్బు సంపాదించేవాళ్లమేమో కానీ, ఇంతటి ఆదరణనూ, అభిమానాన్ని మిస్సయి ఉండేవాళ్లం." అంటున్నాడు సుబ్రమణియన్.

అతడి మాటలు నిజమే కదా! వాళ్లు అనుకున్నట్టుగా దుబయి వెళ్లి ఉంటే- వాళ్లు మాత్రమే ఆ దేశాన్ని చూసి ఉండేవాళ్లు. 'విలేజ్ కుకింగ్ ఛానెల్' వల్ల ఇప్పుడు ప్రపంచం మొత్తం వాళ్ల ఊరిని చూస్తోంది!



ఢాకాలో..



ఇండోనేషియాలో

మారణ హోమం ఆపండి

- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- వేతనాలు పెంచండి
- నినదించిన కార్మిక వర్గం
- ప్రపంచ వ్యాపితంగా మేడే ర్యాలీలు



టోక్యోలో..

న్యూఢిల్లీ : గాజాలో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోత, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, భారత్ వంటి దేశాల్లో ప్రజాస్వామ్యానికి మితవాద శక్తుల నుంచి ముప్పు ఎదురవుతున్న స్థితిలో వీటికి వ్యతిరేకంగా పోరాడాలని కార్మికవర్గం మేడే రోజున ప్రతిజ్ఞ చేసింది. లండన్ నుంచి సియోల్ దాకా పలు నగరాల్లో కార్మిక సంఘాలు, వామపక్షాలు పెద్దయెత్తున ర్యాలీలు నిర్వహించాయి. కడపటి వార్తలందేసరికి బ్రిటన్, స్పెయిన్, గ్రీస్, బెలారస్, టర్కీ, దక్షిణ కొరియా, జపాన్, ఫిలిప్పీన్స్, ఇండొనేషియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో భారీ ర్యాలీలు జరిగాయి. సోషలిస్టు దేశాల్లో మేడే వేడుకలకు సంబంధించిన సమాచారం ఇంకా అందాల్సి ఉంది. ఒక వైపు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి, మరో వైపు వేతనాలు పడిపోతున్నాయి ఈ పరిస్థితుల్లో ధరల పెరుగుదలపై కూడా కార్మికవర్గం కన్నెర్ర చేసింది. కార్పొరేట్లకు అధిక లాభాలు కల్పించడం కోసం కార్మికుల హక్కులపై ప్రభుత్వాలు దాడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

దక్షిణ కొరియాలో...

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో వేలాది మంది నిరసనకారులు పతాకాలను చేబూని పాటలు పాడుతూ, కార్మిక అనుకూల నినాదాలిస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. దేశాధ్యక్షుడు యూన్ సక్ యియోల్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసించారు. 'గత రెండు సంవత్సరాలుగా యూన్ సక్ యియోల్ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన స్థితిగతులు దారుణంగా పడిపోయాయని కొరియా కార్మిక సంఘాల సమాఖ్య నేత యాంగ్ కయింగ్-సూ పేర్కొన్నారు. సియోల్‌తో బాటు దక్షిణ కొరియాలోని అనేక ఇతర నగరాల్లోనూ భారీ ర్యాలీలు జరిగాయి.

జపాన్‌లో...

జపాన్ రాజధాని టోక్యోలో వేలాది మందితో ప్రదర్శన జరిగింది. ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ముదనష్టపు విధానాల వల్ల ఆదాయ అసమానతలు పెరిగిపోయాయని కార్మిక సంఘాల జాతీయ సమాఖ్య నేత మసాకో ఒబాటా తెలిపారు.

ఫిలిప్పీన్స్‌లో...

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో వడగాల్పులను సైతం లెక్కచేయకుండా వేలాది మందితో మేడే మార్చ్ నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఎర్ర జెండాలను చేత పట్టుకొని అధ్యక్ష భవనం వైపు వెళుతున్న ప్రదర్శనకారులను పోలీసులు అడ్డుకున్నారు. 'పని చేయడానికే జీవిస్తాము...చనిపోవడానికి కాదు', 'ధరలు తగ్గించండి...జీతాలు పెంచండి' అని రాసి ఉన్న పోస్టర్లను కార్మికులు ప్రదర్శించారు. నగరంలో ప్రధాన ప్రజా రవాణా వ్యవస్థ అయిన జీప్‌నీస్‌కు చెందిన డ్రైవర్లు సైతం ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ దేశాలలో కూడా...

ఇండోనేషియా రాజధాని జకార్తా, పాకిస్తాన్‌లోని లాహోర్, బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో కూడా మేడే ర్యాలీలు జరిగాయి. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో నిషేధాజ్ఞలు ధిక్కరించి టస్కిం స్క్వేర్‌లో ప్రదర్శన నిర్వహించిన కార్మికులతో పోలీసులు ఘర్షణకు దిగారు.



లాహోర్‌లో..

పంజాబ్ భల్లే.. భల్లే..

- చెన్నైపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం
- గైక్వాడ్ అర్ధసెంచరీ వృథా



చెన్నై: చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్‌కింగ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో ఈ మైదానంలో ఆడిన అన్ని మ్యాచుల్లోనూ నెగ్గిన చెన్నైకు పంజాబ్ కింగ్ చెక్ పెట్టింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 162పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు 17.5ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసి గెలిచింది. ఛేదనలో భాగంగా పంజాబ్ బ్యాటర్లు బెయిర్‌స్టో(46), రూసో(43)కి తోడు చివర్లో శశాంక్ సింగ్(25), కెప్టెన్ సామ్ కర్రన్(26) క్రీజ్‌లో నిలిచి మ్యాచ్‌ను ముగించారు. ఓపెనర్ ప్రభ్ సిమ్రన్(13) మాత్రమే నిరాశపరిచాడు. అంతకుముందు పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి చెన్నై టాపార్డర్ బ్యాటర్లు ఔటవ్వగా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(62) ఒంటరి పోరాటం చేశాడు. పంజాబ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ తొలుత చెలరేగినా... గైక్వాడ్ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి.. అర్ధ సెంచరీతో ఆదుకున్నాడు. అజింక్యా రహానే(29), ఇంప్యాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ(21) బ్యాట్ ఝుళిపించారు. టాస్ ఓడిన చెన్నైకి ఓపెనర్లు శుభారంభమిచ్చారు. తొలుత ఆచితూచి ఆడిన రుతురాజ్ గైక్వాడ్.. అజింక్యా రహానేలు ఆతర్వాత బ్యాట్ ఝుళిపించడం మొదలుపెట్టారు. దాంతో, పవర్ ప్లే(6 ఓవర్లు)లో చెన్నై వికెట్ కోల్పోకుండా 55 పరుగులు చేసింది. పవర్ ప్లేలో పటిష్ట స్థితిలో నిలిచిన చెన్నైని హర్‌ప్రీత్ బ్రార్ వరుసగా రెండు వికెట్లు పడగొట్టి దెబ్బతీశాడు. ఒకే ఓవర్లో అజింక్యా రహానే, శివం దూబేలను ఔట్ చేసి పంజాబ్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత వచ్చిన రవీంద్ర జడేజా(2)ను రాహుల్ చాహర్ ఎల్బీగా వెనక్కి పంపి చెన్నైను మరింత కష్టాల్లోకి నెట్టాడు. 70 పరుగులకే 4 వికెట్లు పడిన జట్టును సమీర్ రిజ్వీ(21)తో కలిసి ఒడ్డున పడేసే ప్రయత్నం చేశాడు. నాలుగో వికెట్‌కు 37 పరుగులు జతచేసిన ఈ జోడీని రబడా విడదీశాడు. రిజ్వీ తర్వాత క్రీజులోకి వచ్చిన మోయిన్ అలీ(15)తో గైక్వాడ్ వేగంగా పరుగులు రాబట్టే ప్రయత్నం చేశాడు. పంజాబ్ కెప్టెన్ సామ్ కరన్ వేసిన ఓవర్లో తొలి సిక్సర్ బాది అర్ధ సెంచరీ సాధించాడు. అలీ సైతం సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే.. 18వ ఓవర్లో అర్ష్‌దీప్ సూపర్ యార్కర్‌తో గైక్వాడ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. ఆ వెంటనే ఎంఎస్ ధోనీ(14).. 20వ ఓవర్లో ఒక ఫోర్, సిక్సర్ బాది స్కోర్ 160 పరుగులు దాటించాడు. దీంతో చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ల 7నష్టానికి 162పరుగులు చేసింది. ధోనీ చివరి బంతికి రనౌటయ్యాడు. పంజాబ్ బౌలర్లు హర్‌ప్రీత్ బ్రార్, చాహర్‌లకు రెండేసి, అర్ష్‌దీప్, రబడాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్‌ప్రీత్ బ్రార్‌కు దక్కింది.

థామస్ కప్ చివరి లీగ్‌లో ఓటమి

రెండోస్థానంతో క్వార్టర్స్ బెర్త్



ఛెంగ్డు(చైనా): థామస్‌కప్‌లో భారత పురుషుల జట్టు గ్రూప్ లీగ్ ఆఖరి పోటీలో ఓటమిపాలైంది. గ్రూప్-సిలో భారత్ ఆడిన తొలి రెండు లీగుల్లో గెలిచి ఇప్పటికే క్వార్టర్స్ బెర్త్ దక్కించుకున్నా.. బుధవారం ఇండోనేషియాతో జరిగిన చివరి లీగ్‌లో 3-1తో ఓటమిపాలైంది. తొలి సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 13-21, 21-12, 21-12తో ఆంటోనీపై గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యతను సంపాదించి పెట్టాడు. ఆ తర్వాత స్టార్ షట్లర్లు చిరాగ్-సాత్విక్ జంట హోరాహోరీ పోరులో 22-24, 24-22, 19-21తో మహమ్మద్-ములానా చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. దీంతో స్కోర్ 1-1తో సమమైంది. ఆ తర్వాత సింగిల్స్‌లో లక్ష్యసేన్ 18-21, 21-16, 17-21తో జొనాథన్ క్రిస్టీ చేతిలో ఓటమితో భారత్ 1-2తో వెనుకబడింది. ఇక నిర్ణయాత్మక డబుల్స్‌లో ధృవ్ కపిల-సాయి ప్రతీక్ 20-22, 11-21తో లియో రోలే-డానియేల్ చేతిలో ఓటమితో భారత్ ఓటమిపాలైంది. దీంతో గ్రూప్-సిలో భారత్ 2వ స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఇక ఉబెర్‌కప్‌లో భారత్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. క్వార్టర్స్‌లో భారత్ పటిష్ట జపాన్‌తో గురువారం(2న) తలపడనుంది.

బొప్పన్న జోడీకి షాక్

మాడ్రిడ్: మాడ్రిడ్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్, భారత్-ఆస్ట్రేలియా ద్వయం అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే ఓటమిపాలైంది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలిరౌండ్ పోటీలో మాథ్యూ ఎబ్డెన్-బొప్పన్న జంట 6-7(4-7), 5-7తో అన్‌సీడెడ్ థాంప్సన్-కొర్డా జోడీ చేతిలో ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను టై బ్రేక్‌లో కోల్పోయిన బొప్పన్న జంట.. రెండో సెట్‌లో ఒక పాయింట్ చేజార్చుకొని ఓడింది.

స్టీవ్ స్మిత్‌కు దక్కని చోటు

టి20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు ఇదే!

మెల్‌బోర్న్: టి20 ప్రపంచకప్‌లో ఆడే ఆస్ట్రేలియా జట్టును ఆ దేశ క్రికెట్‌బోర్డు బుధవారం వెల్లడించింది. ఆల్‌రౌండర్ మిఛెల్ మార్ష్‌కు జట్టు పగ్గాలు అప్పగించిన ఆసీస్ బోర్డు.. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌ను ఎంపిక చేయలేదు. ఆస్ట్రేలియా క్రికెట్‌బోర్డు(సిఎ) ప్రకటించిన 15మంది ఆటగాళ్లలో స్టీవ్ స్మిత్‌కు 14ఏళ్ల తర్వాత తొలిసారి ప్రపంచకప్ జట్టులో చోటు దక్కలేదు. సీనియర్ వికెట్ కీపర్, బ్యాటర్ మాథ్యూ వేడ్‌తోపాటు ఓపెనర్ డేవిడ్ వార్నర్‌లకూ చోటు దక్కింది. ఇక అస్టన్ అగర్, కెమెరూన్ గ్రీన్‌లు తొలిసారి టి20 ప్రపంచకప్‌లో ఆడనున్నారు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ నాథన్ ఎల్లిస్‌తోపాటు పేసర్ మిఛెల్ స్టార్, పాట్ కమిన్స్, హేజిల్‌వుడ్‌లకు జట్టులో చోటు దక్కింది. ఇక టి20 ప్రపంచకప్ అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా జూన్ 1 నుంచి 29 వరకు జరగనున్న సంగతి తెలిసిందే.

జట్టు: మార్ష్(కెప్టెన్), అగర్, కమిన్స్, టిమ్ డేవిడ్, ఎల్లిస్, గ్రీన్, హేజిల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టార్క్, స్టొయినీస్, వేడ్, వార్నర్, జంపా.

ఐపిఎల్‌లో నేడు

సన్‌రైజర్స్ × రాజస్తాన్
వేదిక: హైదరాబాద్; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	9	8	1	16	0.69
కోల్‌కతా	9	6	3	12	1.09
లక్నో	10	6	4	12	0.09
చెన్నై	10	5	5	10	0.62
సన్‌రైజర్స్	9	5	4	10	0.07
ఢిల్లీ క్యాపిటల్స్	11	5	6	10	-0.44
పంజాబ్‌కింగ్స్	10	4	6	8	-0.06
గుజరాత్	10	4	6	8	-0.11
ముంబయి	10	3	7	6	-0.27
బెంగళూరు	10	3	7	6	-0.41

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68